RNI
TEL TEL / 2023/ 84132

# అక్షర సవాల్

సామాన్యుడు ప్రశ్నించే గొంతుక

ప్రచురణ-హైదరాబాద్, రంగారెడ్డి, వరంగల్ ఎడిటర్: బాదావత్ బాలాజి సంపుటి :04 సంచిక :52 బుధవారం 20 మే 2026 పేజీలు -8 వెల రూ 5-00

### కేంద్ర మంత్రి పదవికి

## ఈటల రాజేందర్ పేరు..?

**తెలంగాణ బీజేపీలో జోరుగా ప్రచారం**



**హైదరాబాద్:**తెలంగాణ రాజకీయాల్లో సంచలనంగా మారిన భగీరథ్ పోక్సో కేసు వ్యవహారం ఇప్పుడు ఢిల్లీ రాజకీయ వర్గాల్లో కూడా హాట్ టాపిక్గా మారినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. రాష్ట్రంలో పెరుగుతున్న రాజకీయ పరిణామాలు, కేంద్ర మంత్రివర్గంలో మార్పులపై ఊహాగానాల మధ్య తెలంగాణకు చెందిన నేతలకు కీలక బాధ్యతలు అప్పగించే అవకాశాలపై జోరుగా ప్రచారం జరుగుతోంది. ప్రధాని నరేంద్ర - మిగతా5లో

రిపోర్టర్లు కావలెను

ఈ క్రింది పోస్టులకు అనుభవజ్ఞులు కావలెను

సబ్ ఎడిటర్లు - 02
బ్యూరో చీఫ్ (ఉమ్మడి వరంగల్ జిల్లా) - 01
స్టాఫ్ రిపోర్టర్లు - 06 (జనగాం, మానుకోట, ములుగు, భూపాలపల్లి, వరంగల్, హనుమకొండ)
అడ్వర్టైజ్మెంట్ మేనేజర్ - 01
యాడ్ ఆఫీసర్స్ - 02
సర్క్యులేషన్ ఆఫీసర్ - 01
అనుభవాన్ని బట్టి వేతనం ఇవ్వబడును.

ఇంకెందుకు ఆలస్యం...
9347332442, 8096677136 నంబర్కు వాట్సాప్లో మీ బయోడేటాను పంపండి.

# 44 ఏళ్ల వరకు ఉద్యోగాలకు అర్హత

**హైదరాబాద్, మే 19:**తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న లక్షల మంది నిరుద్యోగులకు రేవంత్ సర్కారు గుడ్ న్యూస్ చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వ సర్వీస్ల్లో ప్రత్యక్ష నియామకాల కోసం నిర్దేశించిన గరిష్ట వయోపరిమితిని మరో 10 ఏళ్లపాటు పెంచుతూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణారావు జీవో జీవో నెంబర్ 86 నుంచి విడుదల చేశారు. ఈ నిర్ణయంతో ఇప్పటి వరకు 34 ఏళ్లుగా ఉన్న గరిష్ట వయోపరిమితి ఇప్పుడు 44 ఏళ్లకు చేరుకుంది. ఈ పెంపు కేవలం ఒక ఏడాదిపాటు అమలులో ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇప్పుడు కొత్తగా వచ్చిన జీవో ప్రకారం ఓసీ అభ్యర్థులు 44 ఏళ్ల వరకు ప్రభుత్వ ఉద్యోగాలకు అప్లై చేసుకోవచ్చు. మిగతా కేటగిరిల రిజర్వేషన్ బట్టి వారి వయోపరిమితి పెరుగుతుంది.



**వయపరిమితి పెంచడానికి కారణమేంటీ?**

తెలంగాణ రాష్ట్ర అండ్ సబార్డినేట్ సర్వీస్ రూల్స్, 1996 ప్రకారం... ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల గరిష్ట వయోపరిమితి 34 ఏళ్లుగా నిర్ణయించారు. అయితే రాష్ట్రంలో నెలకొన్న నిరుద్యోగ సమస్య, నోటిఫికేషన్ల జారీలో జరిగిన ఆలస్యం దృష్ట్యా, అభ్యర్థులు వయసు దాటిపోతున్నామనే ఆందోళనలో ఉన్నారు. దీనిని పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వ, రాబోయే ఒక ఏడాది కాలంలో ఇచ్చే నోటిఫికేషన్లకు పదేళ్ల వయసు అదనపు సడలింపును ప్రకటించింది. అంటే ఓపెన్ కేటగిరి అభ్యర్థులు 44 ఏళ్ల వయసు వరకు పోటీ పడవచ్చు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర రిజర్వేషన్ వర్గాలకు ఈ 44 ఏళ్లకు అదనంగా వారి వారి కేటగిరి సడలింపు వర్తిస్తాయి. ఈ వయోపరిమితి పెంపునకు కారణాలు రెండు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లక్షల మంది నిరుద్యోగ యువత, తాము వయోపరిమితి ముగిసే దశలో ఉన్నామని, గత కొన్నేళ్లుగా సరైన నోటిఫికేషన్లు లేకపోవడం వల్ల తమకు అవకాశం కల్పించాలని ప్రభుత్వానికి అనేక విజ్ఞప్తులు పంపారు. వారి భవిష్యత్ను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.గతంలో ఫిబ్రవరి 8, 2024న ప్రభుత్వం జీవో - మిగతా5లో

### పాలమూరు ప్రాజెక్టులపై మాట్లాడే

## అర్హత బీఆర్ఎస్కు లేదు

**: మంత్రి జూపల్లి కృష్ణారావు**



**హైదరాబాద్, మే 19:** బీఆర్ఎస్ నేతలకు పాలమూరు ప్రాజెక్టుల గురించి మాట్లాడే నైతిక అర్హత లేదని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. 2015లో అప్పటి సీఎం కేసీఆర్ పాలమూరు ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని... రెండేళ్లలో పూర్తి చేస్తామన్నారని గుర్తు చేశారు. లక్ష కోట్ల ప్రాజెక్టును పదేళ్లలో రూ.25 వేల కోట్లు మాత్రమే ఖర్చు పెడితే 90 శాతం ఎలా పూర్తి అయినట్లు అని ప్రశ్నించారు. పాలమూరు ప్రాజెక్టు తర్వాత మొదలుపెట్టిన కాళేశ్వరం ప్రాజెక్టును లక్ష కోట్లు ఖర్చు చేసి ఎలా పూర్తి చేశారని నిలదీశారు. పాలమూరు ప్రాజెక్టులపై గత ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యం వహించిందని విమర్శించారు. గట్టు, కల్వకుర్తి, జూరాల, కోయిల్ సాగర్, భీమా అన్ని ప్రాజెక్టుల విషయంలో పక్షపాతం చూపారని మంత్రి మండిపడ్డారు. కల్వకుర్తి పంపులు బాగు చేయలేకపోయారన్నారు. పాలమూరు ప్రాజెక్టు నీటి కేటాయింపులు సాధించలేకపోయారని తెలిపారు. కృష్ణా నీటిని పదేళ్లు ఏపీకి తాకట్టు పెట్టారని ఆరోపించారు. రాయలసీమను రతనాల సీమ చేస్తామని చెప్పింది బీఆర్ఎస్ కాదా అని ప్రశ్నించారు. గద్వాల్లోని ర్యాలంపాడు రిజర్వాయర్ను పదేళ్లలో రిస్టోర్ చేయలేదన్నారు. పాలమూరు ప్రాజెక్టుల విషయంలో సీఎం రేవంత్ రెడ్డితో స్వయంగా ఎమ్మెల్యేలు, మంత్రులు కలిసి చర్చించామని చెప్పారు. సీఎం కూడా పాలమూరు వాసి కాబట్టి.. ప్రాజెక్టుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టామని, పనులను పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. కల్వకుర్తి కింద చేపట్టనున్న గొల్లపల్లి రిజర్వాయర్ను చేపట్టవద్దని బీఆర్ఎస్ నేతలు ఆందోళనలు చేస్తున్నారని మంత్రి జూపల్లి కృష్ణారావు మండిపడ్డారు.

### 28 నుంచి భారీగా

## పెరగనున్న ధరలు

**3 రకాలుగా సాగు భూముల విలువ సవరణ....**

**హైదరాబాద్, మే 19:**తెలంగాణవ్యాప్తంగా వ్యవసాయ, వ్యవసాయేతర భూములు, అపార్ట్మెంట్ల ప్రభుత్వ మార్కెట్ విలువను సుమారు 50 శాతం వరకు పెంచేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. బహిరంగ మార్కెట్ ధరలకు, ప్రభుత్వ విలువలకూ మధ్య ఉన్న భారీ వ్యత్యాసాన్ని తగ్గించడమే లక్ష్యంగా ఈ నెల 28 నుంచి కొత్త ధరలను అమలు చేయాలని భావిస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వానికి ఏటా రూ.1500 కోట్ల అదనపు ఆదాయం సమకూరనుంది. ముఖ్యంగా ఓఆర్ఆర్ లోపల, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని ఐటీ కారిడార్లు, కమర్షియల్ జోన్లలో ఈ పెంపు ఉండనుంది.తెలంగాణవ్యాప్తంగా రియల్ ఎస్టేట్ రంగానికి కీలకమైన భూముల రిజిస్ట్రేషన్ విలువల సవరణకు ప్రభుత్వం ముమ్మర సన్నాహాలు చేస్తోంది. గ్రామీణ - మిగతా5లో



## కేంద్ర కేబినెట్ విస్తరణ...?

**న్యూఢిల్లీ, మే 19:**దేశంలో ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసిపోయాయి. ఆయా రాష్ట్రాల్లో కొత్త ప్రభుత్వాలు కూడా ఏర్పడ్డాయి. ఇప్పుడు కేంద్రం వంతు వచ్చింది. మిషన్ 2029కి ఇప్పటి నుంచే మోడీ సన్నాహాలు మొదలు పెట్టినట్లుగా తెలుస్తోంది. ప్రభుత్వంలోనూ.. పార్టీలోనూ కీలక మార్పులు చేయాలని భావిస్తున్నట్లుగా సమాచారం. 2029లో తిరిగి అధికారంలోకి రావడమే లక్ష్యంగా భారీ మార్పులు జరగవచ్చని సంకేతాలు వెలువడుతున్నాయి.ఈనెల 26తో మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి కాబోతుంది. ఈ నేపథ్యంలో కేంద్ర కేబినెట్ను విస్తరించాలని భావిస్తున్నారు. మోడీ తన మొదటి, రెండవ పర్యాయాల్లో మంత్రివర్గాన్ని క్రమం తప్పకుండా విస్తరించారు. ప్రస్తుత మంత్రివర్గంలో 72 మంది సభ్యులు ఉండగా.. గరిష్టంగా 81 మంది మంత్రులను నియమించుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మంత్రివర్గ విస్తరణ చేయాలని భావిస్తున్నారు.ఇక ఇటీవల బీహార్, ఉత్తరప్రదేశ్లోని ఎన్డీఏ ప్రభుత్వాలు కూడా తమ మంత్రివర్గాలను విస్తరించాయి. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నవీన్ తన బృందాన్ని కూడా ఏర్పాటు చేస్తారని తెలుస్తోంది. ఈ క్రమంలోనే కేంద్ర మంత్రివర్గంలో



మార్పులు జరుగుతాయనే ఊహాగానాలకు ఆజ్యం పోసింది.గత రెండు పర్యాయాలను పరిశీలిస్తే.. ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల తర్వాత నవంబర్ 2014లో మోడీ తన మంత్రివర్గాన్ని తొలిసారిగా విస్తరించారు. సుమారు ఏడాదిన్నర తర్వాత జూలై 2016లో రెండవ విస్తరణ జరిగింది. సెప్టెంబర్ 2017లో - మిగతా5లో

## మంత్రివర్గ ప్రక్షాళనకు రెడీ.....

**హైదరాబాద్, మే 19:**తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయి రెండున్నరేళ్లు కావస్తుంది. ఇప్పటికీ మంత్రివర్గంలో పూర్తిగా భర్తీ చేయలేదు. ఇంకా మంత్రివర్గంలో రెండు స్థానాలు ఖాళీలున్నాయి. ఎప్పటికప్పుడు మంత్రివర్గంలో ఖాళీలను భర్తీ చేస్తామని ఊరిస్తూనే ఉన్నారు. కానీ ఇంతవరకూ భర్తీ చేయకపోవడంతో ఆశావహుల్లో నిరాశ కలుగుతుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లినప్పుడల్లా పార్టీ పెద్దలతో మంత్రివర్గ విస్తరణపై చర్చించడానికి అంటూ ప్రచారం జరుగుతుండటం, రేవంత్ రిక్త హస్తాలతో తిరిగి రావడం సాధారణంగా మారింది. స్థానిక సంస్థల ఎన్నికలు ఇంకా పూర్తి కావాల్సి ఉంది. అవి పూర్తయిన తర్వాతనే మంత్రివర్గ విస్తరణ ఉంటుందని పార్టీలో ప్రచారం జరుగుతుంది.తెలంగాణలో పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు ముగిశాయి. ఇక గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ తో పాటు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరగాల్సి ఉంది. ఈ ఎన్నికలు ముగిసిన తర్వాత రేవంత్ రెడ్డి ప్రస్తుతం ఉన్న మంత్రివర్గంలో పూర్తి స్థాయి ప్రక్షాళన చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. రెండున్నరేళ్లు కొందరికి మంత్రిగా అవకాశం కల్పించాం కాబట్టి, వారిని తప్పించి, వారి స్థానంలో కొత్త వారిని నియమించుకోవాలన్నది రేవంత్ రెడ్డి ఆలోచనగా ఉంది. ఇది పూర్తి స్థాయి ఎన్నికల టీంగా రేవంత్ రెడ్డి ఏర్పాటు చేసుకోవాలని భావిస్తున్నట్లు చెబుతున్నారు. అయితే అందుకు హైకమాండ్ నుంచి గ్రీన్ సిగ్నల్ అందాల్సి ఉంటుంది.ప్రస్తుత మంత్రివర్గంలో



సామాజికవర్గం - మిగతా5లో

### కేసీఆర్ హయాంలో ఆ ప్రాజెక్టుకు

## భూసేకరణ లేకుండానే టెండర్లు పిలిచారు..

**మంత్రి ధ్వజం**

**హైదరాబాద్, మే 19** : పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. దేవాదుల, ఎస్ఎల్బీసీ, సీతారామ ప్రాజెక్టులతో సమాన ప్రాధాన్యం ఇస్తామని వ్యాఖ్యానించారు. కేసీఆర్ హయాంలో పాలమూరు - రంగారెడ్డి పనులు 90శాతం పూర్తి అయ్యాయన్నది అసత్యమని అన్నారు. బీఆర్ఎస్ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. భూసేకరణ లేకుండానే టెండర్లు పిలిచారని విమర్శించారు. ఈరోజు(మంగళవారం) సచివాలయంలో ఉమ్మడి మహబూబ్నగర్ ప్రాజెక్టులపై మంత్రి ఉత్తమ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా



అధికారులకు పలు కీలక అంశాలపై మంత్రి దిశానిర్దేశం చేశారు. పాలమూరుకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దుతామని చెప్పుకొచ్చారు. జూరాల ప్రాజెక్టులో పూడిక తొలగించి నిల్వ సామర్థ్యం పెంచుతున్నట్లు తెలిపారు. ఀ=ఖా కింద జూరాల అభివృద్ధికి ప్రతిపాదనలు చేశామని వివరించారు. వర్షాకాలానికి ముందే చెరువుల్లో పూడికతీత పనులు చేపడతామని స్పష్టం చేశారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. 1226 గ్రామాలకు తాగునీరు అందిస్తామని తెలిపారు. 15 రోజుల్లో మరోసారి ప్రగతి సమీక్ష నిర్వహిస్తామని చెప్పుకొచ్చారు.

ఆయా ప్రాజెక్టుల పురోగతిపై సమగ్ర నివేదికలు ఇవ్వాలని అధికారులను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు.

### పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై

## సీఎం రేవంత్ కీలక సూచనలు

**హైదరాబాద్, మే 19:** ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమ్సీఆర్హెచ్ఆర్డీలో సమావేశమయ్యారు. ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి సీఎం కీలక సూచనలు చేశారు. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియను దగ్గరుండి యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయించాలని ఆదేశించారు. జిల్లాలోని ఇతర ప్రాజెక్టులకు సంబంధించి వీలైనంత త్వరగా భూసేకరణ పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. భూసేకరణ నిధుల విషయంలో జాప్యం జరగకుండా వెంటనే చెల్లింపులు జరిగేలా చూస్తామని సీఎం చెప్పారు. జిల్లాలోని ఇతర ప్రాజెక్టులకు సంబంధించిపెండింగ్ బిల్లులను



చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై జిల్లా మంత్రులు సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ భేటీలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, మధుసూదన్ రెడ్డి, మేఘా రెడ్డి, రాకేశ్ రెడ్డి, వంశీకృష్ణ, వీర్లపల్లి శంకరయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## ఒకప్పుడు అప్రతిహతం.. నేడు హతం!

దేశంలో కమ్యూనిజం సిద్ధాంతాలను బలోపేతం చేసిన కమ్యూనిస్టు పార్టీలు.. తాజా ఎన్నికలతో కనుమరుగయ్యాయి. ప్రజా పాలనలో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టిన సీపీఐ, సీపీఎం పార్టీలు.. పలు రాష్ట్రాల్లో అధికారం చలాయించాయి. అయితే.. ఒక్కొక్క దశలో ఎదురైన అనేక సంఘర్షణల కారణంగా కాలానికి అనుగుణంగా దూసుకుపోయే తత్వాన్ని అలవరుచుకోని కామ్రేడ్లు.. ప్రజా క్షేత్రంలో తమను తామే ఓడించుకుని.. అధికారానికి దూరమయ్యారు. తాజాగా కేరళలో ఎల్‌డీఎఫ్ కూటమి సైతం ఓటమి పాలవడంతో దేశంలో ఎక్కడా కమ్యూనిస్టుల ప్రభుత్వం లేకుండా పోయింది. మొత్తం 36 రాష్ట్రాల్లో ఎక్కడా కమ్యూనిజం ప్రభావం కూడా కనిపించకపోవడం గమనార్హం. 1980వ దశకంలో, సీపీఐ(ఎం) నేతృత్వంలోని వామపక్ష పార్టీలు కేరళ, త్రిపుర, పశ్చిమ బెంగాల్‌లను ఏకకాలంలో పాలించాయి. లోక్‌సభలోనూ సత్తా చాటాయి. 2004లో 60కి పైగా సీట్లు గెలుచుకుని అత్యున్నత స్థాయికి చేరుకున్నాయి. భారత్–అమెరికా అణు ఒప్పందంపై లోక్‌సభలో దాదాపు 60 మంది ఎంపీలు ఉన్న వామపక్ష కూటమి మద్దతు ఉపసంహరించుకోవడంతో, మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం బలపరీక్షను ఎదుర్కోవలసి వచ్చింది. ఇది అప్పట్లో పెను సంచలనంగా మారింది.పశ్చిమ బెంగాల్‌లో 1977 నుండి 2011 వరకు వామపక్ష కూటమి అధికారంలో ఉంది. ఈశాన్య రాష్ట్రం త్రిపురను 1993 నుండి 2018 వరకు పాలించింది. ఇక, కేరళలో ప్రతి ఐదేళ్లగా అధికారంలో ఉన్న ఎల్‌డీఎఫ్ తాజా ఎన్నికల్లో అధికారం కోల్పోయింది. 1977లో పశ్చిమ బెంగాల్‌లో సీపీఐ(ఎం) అధికారంలోకి వచ్చింది. తద్వారా ఏ రాష్ట్రంలోనైనా ఏ పార్టీకి దక్కని సుదీర్ఘ నిరంతర పాలనకు నాంది పలికింది. జ్యోతి బసు 23 సంవత్సరాలకు పైగా ముఖ్యమంత్రిగా పనిచేశారు. 2000లో బుద్ధదేబ్ భట్టాచార్య సీఎం అయ్యారు. ఆ తర్వాత వామపక్షాలు మరో 11 సంవత్సరాల పాటు బెంగాల్‌ను పాలించాయి. ఈశాన్య రాష్ట్రం త్రిపురలో 1993 నుండి 2018 వరకు వామపక్షాలు అధికారం దక్కించుకున్నాయి. 1993లో రాష్ట్రంలో వామపక్షాలు ఘనవిజయం సాధించాయి. అసెంబ్లీలోని 60 స్థానాలకు గాను సీపీఐ(ఎం) ఒక్కటే 44 స్థానాలను గెలుచుకుంది. 1998 వరకు దశరథ్ దేబ్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆ తర్వాత మాణిక్ సర్కార్ బాధ్యతలు స్వీకరించి 20 సంవత్సరాల పాటు ఆ పదవిలో కొనసాగారు. త్రిపురలో 25 ఏళ్ల వామపక్ష కూటమి పాలన 2018లో బీజేపీ అనూహ్యంగా ఓడించడంతో ముగిసింది. 2023లో బీజేపీ విజయాన్ని పునరావృతం చేసింది.కేరళలో సీపీఐ(ఎం) పేలవమైన ప్రదర్శనతో వామపక్షాల చివరి కంచుకోట కూలిపోయింది. ప్రస్తుత ఓట్ల లెక్కింపు సరళి ప్రకారం, ఈ దక్షిణ రాష్ట్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ సునాయాసమైన ఆధిక్యాన్ని సాధించింది. 2016లో అధికారంలోకి వచ్చిన పినరయి విజయన్ నేతృత్వంలోని సీపీఐ(ఎం) లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డీఎఫ్) ప్రభుత్వం అధికారం నుంచి దిగిపోయింది. 1977 తర్వాత తొలిసారిగా భారతదేశంలో కమ్యూనిస్ట్ ముఖ్యమంత్రి లేక పోవడం గమనార్హం. మరో వైపు దేశవ్యాప్తంగా కార్మికులు, కర్షకుల ఉద్యమా లకు పెట్టింది పేరుగా ఈ పార్టి ప్రాభవం దక్కించుకుంది. గత వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమాల చరిత్ర మహోన్నతమైనది. రష్యా అక్టోబర్ విప్లవ ప్రభావంతోనే ఇండియాలో కూడా 1925లోనే రాడికల్ హ్యూమనిస్టు యంయన్.రాయ్, దత్,యస్ఏ డాంగే, తదితర కార్మిక నేతల నేతృత్వంలో "కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా" సీపీఐ కి అంకురార్పణ జరిగింది. ఆనాటి బ్రిటిష్ వలసవాదులు కమ్యూనిస్టు పార్టీపై నిషేధం విధించడంతో అప్పట్లో రహస్యంగా పనిచేయవలసి వచ్చింది. దేశ వ్యాప్తంగా కమ్యూనిస్టులు ఎన్నెన్నో ఉద్యమాలు చేసారు. గ్రామీణ రైతాంగ ఉద్యమాలు మొదలు, పట్టణ పారిశ్రామిక కార్మికుల ఉద్యమాలు, సింగరేణి, ఆర్టీసీ కార్మికులు , ఉపాధ్యాయ, బ్యాంకు, రైల్వే, ఆర్టీసీ , ఎలక్ట్రిసిటీ , టెలిఫోన్, ప్రభుత్వ ఉద్యోగులైతేనేమి, బీడీ కార్మికులు, పారిశుద్ధ్య కార్మికులైతేనేమి, ఇళ్ల స్థలాల ఉద్యమాలైతే నేమి , జీతాలు, కూలీలు, బోనసులు, పని పరిస్థితుల మెరుగుదల మొదలైన వన్నీ కోట్లాది ప్రజలకు అందిన మేరకు అవన్నీ కమ్యూ నిస్టు ఉద్యమాల ఫలితాలే. లక్షలాది కమ్యూనిస్టు కార్యకర్తల , నాయకుల త్యాగాల ఫలితమే నేడు అమలులో ఉన్న ప్రావిడెంటు ఫండ్ , పెన్షన్, సెలవులు, 8 గంటల పని, తదితర సౌకర్యాలు. ఆదివాసీ గిరిజనులకు,పేదలకు కొన్నయినా భూములు దక్కాయంటే కమ్యూనిస్టులు, నక్సలైట్లు, మావోయిస్టులు, వేలాది మంది ప్రాణ త్యాగాలతో సాధించి పెట్టినవే. ఇంతటి మహత్తర ఉద్యమాల చరిత్ర వేల వేల పేజీలు వేలాది పుస్తకాలుగా డాక్యుమెంట్లుగా రికార్డయి వున్నాయి.నిజానికి కాంగ్రెస్ పార్టీ గురించి చాలా మంది చర్చిస్తారు. కానీ, కాంగ్రెస్ కంటే కూడా ముందుగానే గ్రామాల్లో పరిఢవిల్లిన పార్టీ సీపీఐ అంటే ఆశ్చర్యం వేస్తుంది. ఏ గ్రామానికి వెళ్లినా.. నాలుగు రోడ్ల కూడలిలో ఎర్ర జెండా ఎగరేసే దిమ్మెలు దర్శనమిస్తాయి.కనీసంలో కనీసం పది మంది అయినా.. నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో కనిపిస్తారు. అలా ఒకప్పుడు ప్రాభవాన్ని సంతరించుకున్న పార్టీ, పశ్చిమబెంగాల్, కేరళ, త్రిపుర తదితర రాష్ట్రాల్లో అధికారంలోకి కూడా వచ్చింది. నైజాం రాజరికం ఉన్న తెలంగాణ రాష్ట్రం లో భూస్వామ్య శృంఖలాలు తెంచడంలో కమ్యూనిస్టు పార్టీ పాత్ర కీలకమైనది.ఆంధ్రమహాసభ కార్యక్రమం లో రహస్యంగా ప్రవేశించి గ్రంధాలయ ఉద్యమం,రాత్రి బడులు లాంటి చిన్న చిన్న సంస్కరణలు ద్వారా రైతాంగ ఉద్యమానికి పునాదులు వేసింది.చివరకు అది 'తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటం' గా మారి ఐదు లక్షల గ్రామాలకు ఎర్రజెండా విస్తరించింది."దున్నే వానికే భూమి"కీలక నినాదం ను ముందుకు తేవడం ద్వారా దేశంలో భూసంస్కరణలు అమలు జరపడానికి కమ్యూనిస్టుల పోరాటమే మూలం.సైద్దాంతిక గందరగోళం మధ్య సరైన పంథాలో పయనం సాగించలేకపోయిన భారత కమ్యూనిస్ట్ పార్టీ 1964లో రెండుగా చీలింది. సీపీఐ నుంచి కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్టు) సీపీఎం పార్టీ అవతరించింది. సీపీఐకి చంద్ర రాజేశ్వరరావు, నల్లమల్ల గిరి ప్రసాద్, సీపీఎంనకు పుచ్చలపల్లి సుందరయ్య, మాకినేని బసవపున్నయ్య లాంటి దిగ్గజాలు నేతృత్వం వహించారు. కమ్యూనిస్టు పంథా విషయంలో తిరిగి సీపీఎం పార్టీలో తలెత్తిన విబేధాల మూలంగా 1967లో మరో చీలికకు దారితీసి 'నక్సల్ బరీ 'గ్రామంలో తలెత్తిన తిరుగుబాటుతో (భారత కమ్యూనిస్ట్ పార్టీ మార్క్సిస్టు, లెనినిస్ట్ పార్టీ ,సీపీఐ(ఎంఎల్)గా ఉనికిలోకి వచ్చింది.బెంగాల్ నక్సల్బరీ రైతాంగ ఉద్యమం విభేదాలలోనే చారుమజుందార్, కానూసన్యాల్, వినోద్ మిశ్రా లాంటి నేతలు నక్సలైట్ ఉద్యమానికి బాటలు వేశారు. ఆంధ్రప్రదేశ్ లో దేవులపల్లి వెంకటేశ్వరరావు,తరిమల నాగిరెడ్డి, చంద్ర పుల్లారెడ్డి,పైలా వాసుదేవరావు, కొండపల్లి సీతారామయ్య లాంటి నేతలు పనిచేశారు. కమ్యూనిస్టు ఉద్యమంలో నిజానికి1948 నుండే చీలికలు మొదలయ్యాయి. 1948లో శిబ్దాశ్ ఘోష్ విడిపోయి వేరే పార్టీని ఉద్యమాలను నిర్మించారు. అది నేటికీ బలమైన ట్రేడ్ యూనియన్ గా జాతీయ స్థాయిలో కొనసాగుతుంది. నేటికి కూడా కమ్యూనిస్టులు అనేక చీలికలు పేలికలు కావడంతో వారి ఉద్యమాలు కొన్ని ప్రాంతాలకే పరిమితమయ్యాయి. తెలుగు రాష్ట్రాల్లోనే సీపీఐ ఎంఎల్ లో అనేక చీలికలు కనిపిస్తాయి. జనశక్తి, ప్రజాపంథా, ప్రతిఘటన, ప్రజాప్రతిఘటన, లిబరేషన్, న్యూడెమోక్రసీ, మావోయిస్టు పార్టీ యూసీసీఆర్ఐ ఎంఎల్ ఇలా చెప్పుకుంటూ పోతే పదుల సంఖ్యలో చీలికలుగా కమ్యూనిస్టు పార్టీ ముక్కలుచెక్కలైంది.నేడు వివిధ పార్టీలుగా , గ్రూపులుగా ఉన్నప్పటికీ వారంత కమ్యూనిస్టు వారసులే అని పేర్కొనవచ్చు. రష్యా, చైనా తదితర తమ్యూనిస్టు దేశాలు కూడా మార్కెట్ ఎకానమీలో భాగమై ముందుకు సాగుతున్నారు. అంబేద్కర్, నెహ్రూ, లోహియా , కమ్యూనిస్టులు ఎంతో ఆశలు పెట్టుకున్న నేషనలైజేషన్ స్థానంలో యూ టర్న్ తీసుకొని ప్రపంచీకరణ పేరిట ప్రయివేటీకరణ ముందుకు సాగుతున్న దశ. ఎన్నో ఉద్యమాలతో సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానం స్థానంలో తిరిగి పన్నెండు, పద్నాలుగంటల పని విధానం చాపకింది నీరులా ముందుకు వస్తున్నది. సంఘటిత శక్తుల్లో నీరసం ఆవహించింది. వందేళ్లలో ఊహించని వారెందరో ఆర్థిక వ్యవస్థలో ఎదిగి రాజకీయాలను నిర్దేశిస్తున్నారు. కార్మిక వర్గాన్ని సమిష్టి పారిశ్రామిక వర్గంగా ఎదిగించాలనే ఆలోచన చేయకపోవడం వల్ల కమ్యూనిస్టు లకు సొంత వనరులు , సొంత లాబీలు తగ్గి పోయాయి.

# కేరళ కిరీటం సతీశన్‌కు...



పదేళ్ల సుదీర్ఘకాలం తర్వాత కేరళ ప్రజలు మెచ్చి చరిత్రాత్మక విజయాన్ని కట్టబెడితే ముఖ్యమంత్రి అభ్యర్థిని ఎంపిక చేసుకోవటానికి కాంగ్రెస్ పదిరోజుల సుదీర్ఘ సమయం తీసుకుంది. ఎట్టకేలకు వడస్సేరి దామోదరన్ సతీశన్‌కు ఆ పదవి కట్టబెట్టాలని గురు వారం నిర్ణయించింది. ఈ కాంగ్రెస్ మార్కు కథ అన్నిచోట్లా ఉండేదే. కాకపోతే ఆ పార్టీకి మెజారిటీ లభించే రాష్ట్రాలు కుంచించుకుపోతుండటంవల్ల ఇటీవలి కాలంలో ఆ సంగతి ఎవరికీ పెద్దగా తెలియకుండాపోయింది. కేరళలో సతీశన్‌తోపాటు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, సీనియర్ నేత రమేష్ చెన్నితల కూడా సీఎం రేసులో ఉన్నారు. వారి మధ్య తీవ్ర పోటీ ఉంది. అంతేకాదు... కేరళలో వారి ఇళ్ల దగ్గర గత పది రోజులుగా సాగుతున్న హడావుడికి అంతూ పొంతూ లేదు. ఏ క్షణంలోనైనా తమ నాయకుణ్ణి అధిష్టానం ఎంపిక చేస్తుందని ఆ నాయకుల్ని సమర్థిస్తున్న పార్టీ కార్య కర్తలు రాత్రింబగళ్లు ఆశగా ఎదురుచూశారు. బెదిరింపులు, ఆగ్రహ ప్రకటనలు సరేసరి. అందుకే ఎంపికలో తీవ్ర జాప్యం చోటుచేసుకుంది. అంతిమ నిర్ణయం అధిష్టానానిదేనని చెప్పడం, శాసనసభాపక్షం తీర్మానం ఆమోదించటం రివాజు. అయితే మెజారిటీ సభ్యుల మనోభావాల్ని పరిగణనలోకి తీసుకోవాలన్న మెలిక ఎప్పుడూ ఉంటుంది. మొత్తం 140 స్థానాలున్న కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 63 స్థానాలు లభించగా, ఆ పార్టీ ఆధ్వర్యంలోని యునైటెడ్ డెమాక్రటిక్ ఫ్రంట్(యూడీఎఫ్) కూటమికి మొత్తంగా 102 వచ్చాయి. ఇలా భారీ స్థాయిలో జనం ఆమోదముద్ర ఉన్నా, కూటమి పక్షాలు ఆ అంశాన్ని త్వరగా పూర్తిచేసుకోవాలని ఒత్తిడి చేస్తున్నా పార్టీ అధిష్టానం అడుగు ముందుకేయలేక పోయిందంటే సమస్య ఎంత జటిలంగా మారిందో అర్థం చేసుకోవచ్చు. ఏఐసీసీ నాయకుడిగా తనకున్న పలుకుబడితో అధికశాతం మందికి కేసీ వేణుగోపాల్ టిక్కెట్లు ఇప్పించుకోగలిగారు. అందుకే ఎన్నికైన 63 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో ఏఐసీసీ పరిశీలకులు విడివిడిగా భేటీ అయినప్పుడు 47 మంది ఆయన వైపే మొగ్గారు. ఎమ్మెల్యే కాకపోయినా ఇంతమంది ఆయన వెనకుండటం చిన్న విషయం కాదు. అయితే మిత్ర పక్షాలు, ముఖ్యంగా ఐయూఎంఎల్ మరో నాయకుడు వీడీ సతీశన్‌కు ఇవ్వాలని సూచించాయి. మొన్నటివరకూ విపక్ష నేతగా ఉండటంవల్ల ఆ పార్టీలతో ఏర్పడిన సాన్నిహిత్యం సతీశన్‌కు పనికొచ్చినట్టుంది. రమేష్ చెన్నితలకు మద్దతు పలికినవారి సంఖ్య స్వల్పం. ఎన్నికలొస్తే ఓటమిపాలవుతామన్న బెరుకుకన్నా, గెలిస్తే ఎవరిని ఎలా ఒప్పించా లన్న చింత పార్టీ అధినాయకత్వానికి అధికం. ఇందుకు తనను తానే నిందించుకోవాలి. రాష్ట్రాల్లో పార్టీ ఎదుగుదలకు విశేషంగా కృషిచేస్తూ, ప్రజానీకంలో పట్టు సాధించిన వారంటే నాయకత్వానికి భయం. అందుకే వారికి సమాంతరంగా మరొకరిని ప్రోత్సహించటం అలవాటు. గతంలో రాజస్థాన్, మధ్యప్రదేశ్ వంటి చోట్ల ముఠా కక్షలు ముదిరి పార్టీ చీలికదాకా పోయింది. కాంగ్రెస్‌లో ఎప్పటికీ తనకు భవిష్యత్తు ఉండబోదన్న నిర్వేదంతో ప్రస్తుత కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా వంటి వారు రాజీనామా చేసి బీజేపీలో చేరారు. నిజానికి కేరళ విషయంలో జరిగినంత జాప్యం గతంలో రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, మధ్యప్రదేశ్ వంటి చోట్ల లేదు. ఆ రాష్ట్రాల్లో కూడా సీఎం కుర్చీ కోసం నాయకులు నువ్వా నేనా అన్నట్టు పోటీపడ్డారు. ఎన్నికలకు ముందే కాంగ్రెస్‌లో ముఠా తగాదాలు బయటికొచ్చాయి. అయితే పార్టీలోని యువతరం ఎక్కువగా సతీశన్‌వైపే మొగ్గింది. కొందరు మహిళా కార్యకర్తలను లైంగికంగా వేధించిన నేతలపై చర్య తీసుకోవటంలో సతీశన్ వెనకాడకపోవటం, ఫలానా కులంవారూ, మతంవారూ దూరమవుతారని ఎందరుచెప్పినా వినకపోవడం యువతను ఆకర్షించింది. మంత్రిగా అనుభవం లేకున్నా నిజాయితీ, మంచి చదువరి కావటం, మేధోపరమైన అంశాలు చర్చించటంవంటివి సతీశన్‌కున్న అదనపు అర్హతలు. యూడీఎఫ్‌కు వందకుమించి స్థానాలు రాకపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానన్న సవాలు కూటమికి ఉత్సాహాన్నిచ్చింది. కాంగ్రెస్‌లో నాయకత్వం దక్కితే సరిపోదు. దాన్ని నిలబెట్టుకోవటానికి భిన్న వర్గాలను ప్రసన్నం చేసుకోవాలి. వారి ఆకాంక్షలు తీర్చాలి. ఆ విషయంలో సతీశన్ ఏ మేరకు విజయం సాధిస్తారన్నది మున్ముందు తెలుస్తుంది.

# కరుణరస స్ఫోరకం ఘజ్నవీ ఖండిక



మహాకవి జాషువా రాసిన ఫిరదౌసి కావ్యం తెలుగునాట సుప్రసిద్ధం. 'రాజు మరణించె ఒక తార రాలిపోయె/ కవియు మరణించె ఒక తార గగనమెక్కె/రాజు జీవించు రాతి విగ్రహములందు/సుకవి జీవించు ప్రజల నాలుకల యందు' అనే పద్యం ఇప్పటికీ కవులు వేదిక మీద నిత్యనూత నంగా ఆలపిస్తున్నారు. ఫిరదౌసి కవి విషాద జీవితాన్ని జాషువా కవి రాయడం కన్నా ముందు సురవరం ప్రతాపరెడ్డి 'సుల్తాన్ మహమూద్ ఘజ్నవీ' అనే ఖండిక రాశారు.

ఇది చారిత్రక, కవి జీవితానికి సంబంధించిన కథ. 174 పంక్తుల గీతమాలికలో రాసింది. ఈ మాలిక 1923లో తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురం నుంచి వెలువడిన 'రెడ్డి రాణి' అనే పత్రికలో అచ్చయింది. (సంగిశెట్టి శ్రీనివాస్ సంకలనం చేసిన సురవరం కవిత్వం పుస్తకానికి సుంకిరెడ్డి నారాయణ రెడ్డి ముందుమాట). ఇందులోని అంశం భారతదేశంపై అనేకమార్లు దండయాత్రలు చేసిన మహమూద్ ఘజ్నవీ చరిత్ర తెలుపడం. మహమ్మదీయులు భారతదేశంపైకి చొరబడడం అతనితోనే మొదలు. హిందువులు ఎంత గొప్పవీరులై అతనినెదిరించారో ఇందులో వివరించారు.

సుమారు 95 పంక్తుల తేటగీతిమాలికలో గజనీ దాడులను, హిం దూదేశాన్ని కొల్లగొట్టడం గురించే వివరించారు. భరత ఖండపు పచ్చిమ భాగమందు/కలదు 'కాబూలు' దేశంబు ఖ్యాతి గాం చి/దానినేలె 'సుబక్తగీన్' ధర్మబుద్ధి/తండ్రి పిమ్మట' మహమూదు తక్తు నెక్కె/ఎక్కి పరరాష్ట్రముల జేర్చి యింపుగాంచె/నంత నతడు హిందూస్థానమంత గెలిచి/ధనముగూర్చి యిస్లాముదనర జేయ/దలచి పలుమాఋ తమి మీద దాడి వెడలె..ఇట్లా అతడు కాబూలు వాడని తండ్రి తరువాత రాజై పొరుగువారిని జయించాడని, ఆ తర్వాత హిందూదేశాన్ని కొల్లగొట్టాలని దాడులు జరిపాడని మొదలవుతుంది. ఒక కథ చెప్పినట్లుగా చరిత్రను సవివరంగా చెప్పారు.

'తక్తు' అనేది మహమ్మదీయులు వాడుకునే మాట. గద్దెనెక్కె అని అర్థం. సింహాసనం అని మనవాళ్లు వాడుకునే మాటకు పర్యాయం వంటిది. సురవరం ఈ ఖండిక రాసేనాటికి నిజాం ప్రభుత్వమే నడుస్తున్నది. తక్తుపై నిజాం ఉన్నాడనేది సాధారణ వాడుక. అదే ఇందులో ప్రయోగించడం సాధారణ ప్రజలకు తెలియడం, ఇస్లాంల కథ కనుక వారి పదాన్నే ప్రయోగించడం ఒక ఔచిత్యం.

ఈ సుదీర్ఘ గీతమాలికలో దాదాపు 20 పంక్తుల్లో ఫిర్దోసి అనే కవి జీవితానికి సంబంధించినది. జాషువా రచించిన సుప్రసిద్ధ ఫిరదౌసి కావ్యం కన్నా తొమ్మిది సంవత్సరాలు ముందుగా దీనిని రాశారు.

సంపన్నుడైన రాజును కవులు ఆశ్రయించారు. అందులో 'ఫిర్దోసి' ఒకరు. ఆతనినే రాజు ఆదేశించాడు.. తన చరిత్రను కావ్యం గా రాయాలని. అందుకు పద్యానికొక అష్రఫీ ఇస్తానని వాగ్దానం చేశాడు.

ఘజ్నవీ ఫిర్దోసి కొక్క వాగ్దాన మిచ్చె
పద్యమున కొక్క యష్రఫీ వరుసనొసగ
అర్థలక్ష పద్యంబుల నతడు వ్రాసి
పాదుషా మ్రోల నిలిచిన పలికె రాజు
'ఓయి! ఫిర్దోసి యష్రఫీలొసగ జాల
వాని మారుగ రూప్యముల్ పరగ నిత్తు'..

ఇందులో అష్రఫీ అంటే బంగారు నాణేలు, రూప్యములు అంటే వెండి నాణేలు అని అర్థం. మోసం చేసిన రాజును నిందించి కవి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. తరువాత ఒకనాడు మరో కవి ఫిర్దోసి రాసిన కావ్యంలోని పద్యాలను ఘజ్నవీ ముందు పాడి విన్పించాడు. అది విని అవి ఫిర్దోసీ పద్యాలని తెలుసుకొని ఆ కవికి చేసిన అన్యాయం దిద్దుకోవాలని భటులతో తానే కవి వద్దకు వెళ్లాడు. కానీ అప్పటికే ఆ కవి తనువు చాలించాడు. తాను తెచ్చిన ధనమంతా ఫిర్దోసి ఆత్మజులకు అందించాడు. కానీ చివరి కథలో గజనీ తనకు విజయాలను చేకూర్చిన అశ్వాలను, తాను సంపాదించిన ధనరాశులను, కోటబురుజులను చూసి వాటిని విడలేని దుఃఖాన్ని అనుభవించాడు. కన్నీరు కార్చి కార్చి మరునాడే యముని వద్దకు చేరుకున్నాడు.

కొద్దిభాగంలో కవి పరిస్థితిని ఆర్ద్రంగా రచించారు సురవరం. కానీ అనేక విజయాలను సాధించిన ఘజ్నవీ జీవితంలో తెచ్చిన పెనుమార్పులకు ఈ కవి కథ కారణమైంది. ఘజ్నవీ తన అశ్వాలను, ధనరాశులను, చూసి మురిసిపోయి, చరమదశలో వాటిని వదలలేని పరితాపానికి గురయ్యాడు. పరిపరివిధాల వేదనను అనుభవించాడు. అతని వేదన మాన్పించగల దక్షులెవరూ లేరు. కన్నీరు కార్చాడు. ఈ దృశ్యాన్ని కరుణరస స్ఫోరకంగా రాశారు సురవరం. ముగింపుగా ఒక సఅందించే చరణాలు రాశారు.

చావుబ్రతుకులు తిరుగును చక్రగతిని
'సోక్రటీసే'గె శేషించె సాత్వికంబు
'సీజరేగి'నను ప్రతాపి శిఖలు వెలసె
'కృష్ణరాయలు' వెడలిరి కీర్తి మిగిలె
వీరి తనువులు మట్టిలో చేరిపోయె
మూఢబుద్ధిని గలిగె మహమూద నీకు
బియ్యమున నూలు గలిసిన
విధము చూవె
భూమిపై హెచ్చుతగ్గులు పొసగి యుండు
భువనముల నెల్ల సాధించి పూర్ణముగను
పావనాత్మను గోల్పోవ ఫలముగలదె'
యనెడి నీతికి లక్ష్యమై యవతరించి
తేమొ కాని నీ ఘనత యింకెందు గలదు?

ఎంత ప్రపంచాన్ని జయించినా పావనాత్మను, పవిత్రత లేని, నీతి ధర్మం పాటించని వారికి ఘనత ఏముంటుంది? అని ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు ఎంతటివాడైనా నీతి ధర్మం పాటించడమే లక్ష్యం కావాలనే మానవీయ సందేశం ఉంది. ఇది చారిత్రక ఖండ కావ్యం. ఇందులో ఫిర్దోసి (సురవరం ఇట్లే రాశారు, జాషువా ఫిరదౌసి అని వాడారు). కవికి, రాజుకు మధ్య జరిగిన కథ అయినా కవిని, రాజును వేదనకు గురిచేసిన ఘట్టం.

ఘజ్నవీ చరిత్ర విషాదాంతం. ఫిర్దోసి కథ విషాదాంతం. సోక్రటీసు, సీజరు, కృష్ణరాయలు పేర్లను సురవరం ప్రస్తావించడం ఆయనకు ప్రపంచ చరిత్ర పట్ల గల సమగ్రమైన అవగాహనకు సాక్ష్యం. పాశ్చాత్యుల నుంచి మన తెలుగు రాజుల వరకు అనే విస్తృతార్థం. కీర్తికారకమైన ఉత్తమ ధర్మాన్ని పాటించటమే పాలకుల లక్ష్యంగా అందించిన ప్రబోధం.

జాషువా ఫిరదౌసి కావ్యం కవిని కథానాయకుడుగా చేసింది. ప్రతాపరెడ్డి గజనీని కథానాయకుడిగా చేశారు. ఇందులో దేశం, మతం, పరస్పర దాడులు, విధ్వంసాలు ఒక భాగం చారిత్రకం కాగా, ఫిర్దోసి కవి సంఘటన చేర్చడం, అది రాజు పరిణామానికి కారణం కావడంగా మలచటం విశేషం.

ఈ కథ ముందు, వెనుకలుగా ఇద్దరు కవులు రాయడం వెనుక కవిజీవితం లోని విషాదమే ప్రధానం. రాజుల ఆస్థానాల్లో కవులు ఏ దేశంలోనైనా గౌరవం పొందుతారు. అవమానాలు ఎదుర్కొంటారు. అందులో ఇది అత్యంత ప్రసిద్ధమైన చారిత్రక ఘట్టం.

సురవరం రాసిన ఈ ఖండిక ఆంధ్ర ప్రాంతపు పత్రికలో అచ్చుకావడం వలన దానిని జాషువా చదివి ఉంటారా? అనేది తెలియదు. ముందు, వెనుకలుగా రాసినా ఎవరి కవితాపాకం వారిదే. ఎవరి రచనా పాటవం వారిదే. అయితే తెలుగునాట జాషువా ఫిరదౌసి ప్రచారం జరిగినంతగా సురవరం వారి ఫిర్దోసి ప్రచారంలోకి రాకపోవడం విచారించదగ్గ విషయం.

జాషువా ఫిరదౌసి కావ్యం కవిని కథానాయకుడుగా చేసింది. ప్రతాపరెడ్డి గజనీని కథానాయకుడిగా చేశారు. ఇందులో దేశం, మతం, పరస్పర దాడులు, విధ్వంసాలు ఒక భాగం చారిత్రకం కాగా, ఫిర్దోసి కవి సంఘటన చేర్చడం, అది రాజు పరిణామానికి కారణం కావడంగా మలచటం విశేషం.

# న్యూ శాయంపేటలో హనుమాన్ విగ్రహం ధ్వంసం..

**ఉద్రిక్తత రోడ్డుపై భక్తుల ధర్నా, పలువురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు**





**హనుమకొండ,అక్షర సవాల్** :హనుమకొండ నగరం 31 డివిజన్ న్యూ శాయంపేట సర్కిల్‌లో శ్రీ భక్తాంజనేయ దేవాలయానికి చెందిన హనుమాన్ స్వామి విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. మంగళవారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగినట్లు స్థానికులు తెలిపారు. విగ్రహాన్ని ముక్కలుగా పగులగొట్టి పడేసిన తీరుపై భక్తులు, గ్రామ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.



**స్థల వివాదం నేపథ్యం:**
సర్వే నెంబర్ 23లో ఐదెకరాల 10 గుంటల స్థలం శ్రీ భక్తాంజనేయ దేవాలయం పేరు మీద ఉందని స్థానికులు చెబుతున్నారు. ఈ స్థలంలో హనుమాన్ భక్తులు, అయ్యప్ప స్వామి భక్తులు బతుకమ్మ, దసరా ఉత్సవాలు, గణపతి నవరాత్రులు, అమ్మవారి నవరాత్రులు నిర్వహించుకుంటారు. కొంత భాగం చెరువుగా ఉన్న ప్రాంతాన్ని భద్రకాళి చెరువు మట్టితో నింపి అభివృద్ధి చేసుకునే క్రమంలో విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ స్థలం దేవాలయం అధీనంలోనే ఉండాలని భక్తులు కోరగా జిల్లా అధికారులు, ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ క్రమంలోనే విగ్రహం ధ్వంసం కావడం కలకలం రేపింది.



**భక్తుల ఆందోళన:**
విషయం తెలుసుకున్న వెంటనే పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, అఖిలపక్ష నాయకులు భక్తులు, బజరంగ్‌దళ్ కార్యకర్తలు, ఘటనాస్థలికి చేరుకున్నారు. విగ్రహం ధ్వంసానికి నిరసనగా న్యూ శాయంపేట ప్రధాన రోడ్డుపై ధర్నాకు దిగారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

**పోలీసుల చర్యలు:**
పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు భారీగా మోహరించారు. ధర్నా చేస్తున్న పలువురు భక్తులను, స్థానికులను అరెస్టు చేసి సిఐ సుబేదారి సిఐ రంజిత్ రావు ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని, అధికారుల నిర్లక్ష్యంపై విచారణ జరపాలని శ్రీ భక్తాంజనేయ భక్తులు, గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఘటనాస్థలంలో పోలీసులు పికెటింగ్ కొనసాగిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు మామిండ్ల రాజు, మాడిశెట్టి శివశంకర్, వేల్పుల మోహన్ రావు, కాంగ్రెస్ జిల్లా కమిటీ సభ్యులు మామిండ్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## మద్యం తాగించి స్టూడెంట్ పై రేప్

**హైదరాబాద్, మే 19:** హైదరాబాద్ శివారులోని ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో దారుణం చోటుచేసుకుంది. తోటి విద్యార్థినిపై ఓ ఇంజినీరింగ్ విద్యార్థి అత్యాచారానికి పాల్పడ్డాడు. నమ్మి వెంట వెళ్లిన స్నేహితురాలికి మద్యం తాగించి, లైంగిక దాడి చేశాడు. బాధితురాలు ధైర్యం ముందుకు వచ్చి ఫిర్యాదు చేయడంతో పోలీసులు నిందితుడ్ని అరెస్ట్ చేసి విచారణ చేపట్టారు.ఇబ్రహీంపట్నం సీఐ మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌కు చెందిన ఉడుతల ఉదయ్ ఇబ్రహీంపట్నంలోని ఒక ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. మే 14న తేదీన రాత్రి తన క్లాస్‌మేట్ అయిన ఒక యువతిని టీ తాగడానికి వస్తావా అని పిలిచి, తన కారులో దిల్‌సుఖ్‌నగర్‌కు తీసుకెళ్లాడు. అనంతరం వారు కారులో ఇబ్రహీంపట్నం తిరిగి వస్తున్న సమయంలో ఉదయ్ మద్యం కొనుగోలు చేశాడు. తన ప్లాన్ ప్రకారం బీడీఎల్ రోడ్డులోని నిర్మానుష్య ప్రదేశానికి కారును తీసుకెళ్లి, అక్కడ విద్యార్థినికి బలవంతంగా మద్యం తాగించాడు. ఆమె మత్తులోకి వెళ్లాక, ఇబ్రహీంపట్నంలోని ఒక గదికి కారులో తీసుకెళ్లి ఆమెపై అత్యాచారం చేశాడు. ఈ ఘటనపై మే 17న బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు నిందితుడు ఉడుతల ఉదయ్‌ను సోమవారం నాడు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు.

**ఉరేసుకుని నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్య..**
తీవ్రమైన తలనొప్పిని భరించలేక ఓ నర్సింగ్ విద్యార్థిని ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం పెద్దముప్పారం గ్రామంలో ఈ విషాదం చోటుచేసుకుంది. దంతాలపల్లి ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఊడ్గుల గౌరయ్య, సోమక్క దంపతుల చిన్న కుమార్తె ఊడ్గుల దివ్య (21) వరంగల్‌లోని ఒక కాలేజీలో నర్సింగ్ కోర్సు చదువుతోంది. 4 రోజుల క్రితమే ఆమె పెద్దముప్పారంలోని తన ఇంటికి వచ్చింది.దివ్య గత కొంతకాలం నుంచి తీవ్రమైన తలనొప్పితో బాధపడుతోంది. ఈ క్రమంలో నొప్పి తీవ్రతను భరించలేక ఆదివారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లో చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సోమవారం నాడు ఈ విషయం వెలుగులోకి వచ్చింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. అనంతరం శవ పంచనామా నిర్వహించి, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం వర్ధన్నపేటలో ఆసుపత్రికి తరలించారు.తల్లిదండ్రులు దివ్యకు వివాహం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్న సమయంలోనే ఇలా జరగడం కుటుంబంలో తీవ్ర విషాదం నింపింది. కుమార్తె మృతితో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. కుమార్తె ఆత్మహత్యపై తండ్రి గౌరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు.

## సుందరయ్య ఆశయ సాధనకు కృషి చేయాలి...



**సీపీఎం జిల్లా నాయకుడు కారు ఉపేందర్**

**హనుమకొండ, అక్షర సవాల్ :** హన్మకొండ నగరం న్యూ శాయంపేట సుర్జిత్ నగర్‌లో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి సభ ఘనంగా జరిగింది. 31వ డివిజన్ పరిధిలో సీపీఎం శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కారు ఉపేందర్, శాఖ కార్యదర్శులు, పార్టీ సభ్యులు, కాలనీవాసులు సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ.. చిన్ననాటి నుంచే అభ్యుదయ భావాలు కలిగిన సుందరయ్య అవినీతి, అక్రమాలపై పోరాడారని, సామాజిక అసమానతలు రూపుమాపేందుకు తన పేరులోని 'రెడ్డి'ని తొలగించుకుని సుందరయ్యగా మారారని గుర్తుచేశారు. దళితులు ఊరు బావిలో నీరు చేదుకునేందుకు పోరాటాలు చేసిన ఆయన త్యాగం మరువలేనిదన్నారు.సమాజ సేవకు ఆటంకం కలుగుతుందని కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకున్న ఆదర్శ దంపతులు సుందరయ్య-లీలావతి అని కొనియాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించి నిజాం, రజాకార్లను ఎదిరించి 10 లక్షల ఎకరాలను పేదలకు పంచారని తెలిపారు. ఎమ్మెల్యేగా, ప్రతిపక్ష నేతగా సైకిల్‌పై అసెంబ్లీకి వెళ్లిన నిరాడంబర నాయకుడని అన్నారు నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుల, మత విభజనలు చేస్తున్నాయని, ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం పెరుగుతున్నాయని విమర్శించారు. సుందరయ్య ఆశయాల సాధనకు, సమ సమాజ స్థాపనకు కమ్యూనిస్టులు పోరాడాలని, అదే ఆయనకు నిజమైన నివాళి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శులు ఇనుముల వనమాల, వంగ సదానందం, కురుకు రంజిత్, పెండ్యాల లక్ష్మణ్, కాదాసీ రామస్వామి, కొండ యాకయ్య, లక్ష్మి, రజిత, రమ, చెరుపల్లి బాబు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి



**నల్లబెల్లి మండలం మే19 అక్షర సవాల్** నల్లబెల్లి మండలంలోని కొన్ని గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న పారిశుద్ధ్య సిబ్బందికీ నెలలు కావస్తున్నా వారికి ఇవ్వవలసిన 9,500 చొప్పున మాత్రమే ఇచ్చే గౌరవ వేతనాలు కూడా ఇవ్వకపోవడం వలన పారిశుధ్య సిబ్బంది తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారనీ సిపిఐ నల్లబెల్లి మండల కార్యదర్శి బట్టు సాంబయ్య అన్నారు. మండల కేంద్రములో ఏర్పాటుచేసిన సమావేశంలో సాంబయ్య మాట్లాడుతూ కొన్ని గ్రామపంచాయతీలలో ఆన్లైన్ కార్మికులకు ఇవ్వవలసిన నెలకు. 9500/- లను కూడా తీర్మానం చేయలేదనే నెపంతో 7000 వరకే జీతాలు ఇస్తున్నట్టు సిబ్బంది తమ దృష్టికి తీసుకు వచ్చినట్టు చెప్పారు. ఆన్లైన్ కార్మికులకు 9500/- సక్రమంగా చెల్లించేటట్టు చర్యలు తీసుకోవాలని గ్రామపంచాయతీ పాలకవర్గాలకు కార్యదర్శులకు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. పారిశుద్ధ్య సిబ్బంది గ్రామపంచాయతీల పాలకవర్గం కార్యదర్శులతో సమన్వయం చేసుకొని విధి నిర్వహణలో ముందుకు సాగాలన్నారు .ఈ సమావేశంలో ఎం ఆర్పీ ఎస్ మండల అధ్యక్షుడు దళితరత్న అవార్డు గ్రహీత పరికి రత్నం మామిళ్ల పెద్ద ఐలయ్య కొంకటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో సేవాఘడ్ నుంచి ఢిల్లీ కోట వరకు మహా యాత్ర...





**గోర్ బోలిని 8వ షెడ్యూల్లో చేర్చాలి**
**దేశంలోని బంజారాలందరినీ ఎస్టీలుగా గుర్తించాలి....**
**పార్లమెంటులో లాకాగోర్ విగ్రహాన్ని ప్రతిష్టించాలి**
**: గోర్ సిక్వాడి జాతీయ నేతలు**
**శ్రీ మహారాజ్, ఆర్ సి చౌహన్, బాలా సాహెబ్...**

**వరంగల్, మే 19 అక్షర సవాల్ :** దేశవ్యాప్తంగా ఉన్న బంజారాల హక్కుల సాధన కోసం సేవాఘడ్ నుంచి ఢిల్లీ కోట వరకు భారీ యాత్ర చేపట్టనున్నట్లు గోర్ సిక్వాడి జాతీయ నేతలు ప్రకటించారు. మంగళవారం వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని భవ్య దేవాలయంలో శ్రీ సేవాలాల్ మహారాజ్, మేరమ యాడి, రామారావు బాపు విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి హాజరైన జాతీయ నేతలు ఈ మేరకు వెల్లడించారు. అనంతపురం జిల్లాలోని సేవాలాల్ మహారాజ్ జన్మస్థలం సేవాఘడ్ నుంచి ఈ యాత్ర ప్రారంభమై 18 రాష్ట్రాల మీదుగా సాగుతుందని గోర్ సిక్వాడి నేతలు తెలిపారు. యాత్ర చివరగా లాఖాగోర్ జన్మస్థలమైన ఢిల్లీలో భారీ బహిరంగ సభతో ముగుస్తుందని బంజారా సంఘసంస్కర్త శ్రీ మహారాజ్ వెల్లడించారు.

**ప్రధాన డిమాండ్లు:**
1. గోర్ బోలిని రాజ్యాంగ 8వ షెడ్యూల్లో చేర్చాలి: దేశంలో కోట్లాది మంది బంజారాలు మాట్లాడే గోర్ బోలి భాషకు గుర్తింపు లేదు. వెంటనే 8వ షెడ్యూల్లో చేర్చి భాషకు, జాతికి గౌరవం కల్పించాలని డిమాండ్ చేశారు.
. దేశవ్యాప్తంగా బంజారాలను ఎస్టీలుగా గుర్తించాలి: కొన్ని రాష్ట్రాల్లో ఎస్టీలుగా, మరికొన్ని చోట్ల బీసీలుగా, ఓసీలుగా ఉన్న బంజారాలను దేశమంతటా ఒకే విధంగా ఎస్టీలుగా గుర్తించి రిజర్వేషన్లు కల్పించాలని కోరారు.
. లాఖాగోర్ విగ్రహాన్ని పార్లమెంటులో ప్రతిష్ఠించాలి: ఢిల్లీలోని ప్రస్తుత సుప్రీంకోర్టు, పార్లమెంట్ భవనం ఉన్న స్థలం వజ్రాల వ్యాపారి, వేలకోట్ల ఆస్తిపరుడైన లాఖాగోర్‌దేనని చరిత్ర చెబుతోందని శ్రీ మహారాజ్ అన్నారు. ఆ మహానుభావుడి విగ్రహాన్ని పార్లమెంటులో ప్రతిష్ఠించి గౌరవించాలని ప్రభుత్వాన్ని కోరారు.

**సేవాలాల్ దేవాలయాలను సందర్శించిన జాతీయ నేతలు**
నెక్కొండలో జరిగిన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి గోర్ సిక్వాడి జాతీయ అధ్యక్షులు ఆర్.సి. చౌహాన్, గోర్ సేన జాతీయ అధ్యక్షులు బాలాసాహెబ్ హాజరై ప్రసంగించారు. అనంతరం ఖిలా వరంగల్‌లోని ఓ ప్రైవేట్ రిసార్టులో గోర్ సిక్వాడి ముఖ్య నేతల సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశంలో యాత్ర రూట్‌మ్యాప్, డిమాండ్లపై చర్చించారు. దేశంలోని ప్రతి బంజారా తండాకు చేరువయ్యేలా యాత్రను రూపొందించినట్లు నేతలు తెలిపారు. 18 రాష్ట్రాల్లోని ప్రధాన సేవాలాల్ దేవాలయాలు, చారిత్రక ప్రదేశాల మీదుగా యాత్ర సాగుతుందని వెల్లడించారు.

**శ్రీ మహారాజ్ ప్రసంగం:**
"సేవాలాల్ మహారాజ్ చూపిన బాటలో బంజారా జాతి ఆత్మగౌరవం కోసం పోరాడుతున్నాం. గోర్ బోలికి గుర్తింపు లేక, ఎస్టీ హోదా లేక మా జాతి విద్య, ఉద్యోగాల్లో వెనుకబడిపోయింది. లాఖాగోర్ లాంటి వజ్రాల వ్యాపారులు ఉన్న జాతి మాది. ఆ చరిత్రను ప్రపంచానికి చాటేందుకే ఈ యాత్ర" అని శ్రీ మహారాజ్ ఉద్ఘాటించారు.

**రంగసాయిపేటలో ప్రత్యేక పూజలు**
నేతల బృందం వరంగల్ రంగసాయిపేటలోని శ్రీ సేవాలాల్ మహారాజ్ మందిరాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోర్ సిక్వాడి, గోర్ సేన నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**యాత్ర ఉద్దేశం:**
1. బంజారా సంస్కృతి, చరిత్రపై అవగాహన కల్పించడం.
2. గోర్ బోలి, ఎస్టీ హోదా డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం.
3. 18 రాష్ట్రాల్లోని బంజారాలను ఏకతాటిపైకి తీసుకురావడం.
4. లాఖాగోర్ చరిత్రను వెలుగులోకి తెచ్చి పార్లమెంటులో విగ్రహం ఏర్పాటు చేయించడం.

**జాతీయ అధ్యక్షుడు ఆర్.సి. చౌహాన్ వ్యాఖ్యలు:**
"ఇది కేవలం యాత్ర కాదు, జాతి చైతన్య పునరుజ్జీవన ఉద్యమం. సేవాఘడ్‌లో మొదలై ఢిల్లీ కోటలో ముగిసే ఈ యాత్ర చరిత్ర సృష్టిస్తుంది. ప్రతి బంజారా బిడ్డ ఈ యాత్రలో భాగస్వామి కావాలి" అని పిలుపునిచ్చారు. యాత్ర తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని, లక్షలాది మందితో ఢిల్లీలో మహా గర్జన నిర్వహిస్తామని నేతలు స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న తండాల్లో ఇప్పటికే యాత్రపై చర్చ మొదలైందని, బంజారా యువత పెద్ద ఎత్తున కదిలేందుకు సిద్ధమవుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గొర్ సిక్వాడి నేతలు హట్యా నాయక్ రాములు నాయక్ రవీందర్ నాయక్, మహేశ్వర రాథోడ్, చిట్టిబాబు నాయక్ తదితరులు పాల్గొన్నారు

## హన్మకొండ న్యూ శాయంపేటలో.. శ్రీ హనుమన్ స్వామి విగ్రహం ధ్వంసం.. స్థానికుల్లో ఆగ్రహం

**హన్మకొండ,మే 19 అక్షర సవాల్:** హంటర్ రోడ్ న్యూ శాంపేటలో గల హనుమాన్ దేవాలయ విగ్రహాన్ని కొందరు దుండగులు కూల్చడం జరిగింది ఈ కార్యక్రమం లో విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు పాల్గొన్నారు విశ్వహిందూ పరిషత్ కిలా



ప్రఖండ అధ్యక్షులు రామ రాకేష్ కార్యదర్శి గండి నాగరాజ్ కిలా ప్రకండ బస్తీ గోరక్షక్ వంశీకృష్ణ కిలా వరంగల్ శేఖర్ బొల్లికుంట చీకటి వంశీ నరేష్ మధు శ్రీరామ్ దాసరి రాజు రణధీర్ రాహుల్ సన్నీ కార్తీక్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి ఫిర్యాదుపై మల్లు రవి స్పందన



**హైదరాబాద్, మే 19**: పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి పలువురిపై ఫిర్యాదు చేశారని క్రమ శిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి తెలిపారు. రామసహాయం కృష్ణ కిషోర్ రెడ్డి, హరిప్రసాద్‌లపై ఫిర్యాదు అందిందన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు ఓడిపోవడానికి కారణం ఇద్దరే అని ఫిర్యాదు అందినట్లు తెలిపారు. కృష్ణ కిషోర్ రెడ్డి, హరిప్రసాద్ తమ వాదనలు వినిపించారని.. ఎమ్మెల్యేతో కలిసి కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం పని చేస్తామని ఇద్దరు నేతలు హామీ ఇచ్చారన్నారు. అందరూ కలిసి పనిచేస్తే పాలకుర్తి నియోజకవర్గంలో పార్టీ బలంగా ఉంటుందని చెప్పారు. మహబూబాబాద్ జిల్లా గ్రంథాలయం చైర్మన్‌గా ఉన్న శ్రీకాంత రెడ్డి రెండు వర్గాలను కో ఆర్డినేట్ చేస్తారని.. ఎవరినీ సస్పెండ్ చేయాలనే ఉద్దేశ్యం తమకు లేదని స్పష్టం చేశారు.

**జీహెచ్‌ఎంసీ పరిధిలోని నేతలకు వార్నింగ్**

జీహెచ్‌ఎంసీ పరిధిలోని నేతలకు క్రమశిక్షణ కమిటీ వార్నింగ్ ఇచ్చింది. జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్ అభ్యర్థిగా ఎవరికి వాళ్లు ప్రకటించుకున్నారని మల్లు రవి తెలిపారు. యూత్ కాంగ్రెస్ నేతలు తామే పోటీ చేస్తున్నట్లు ప్రచారం చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇలాంటి చర్యలు చేస్తే వేటు వేస్తామని హెచ్చరించారు. అభ్యర్థి ప్రకటనకు కాంగ్రెస్ పార్టీలో ఒక ప్రొసీజర్ ఉంటుందన్నారు.

**ధర్మపురి అరవింద్‌కు కౌంటర్**

నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు మల్లు రవి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. 'మనది వెస్ట్ బెంగాల్, బిహార్ కాదు.. ఇక్కడ సీఎంగా ఉన్నది రేవంత్ రెడ్డి. తానే మళ్లీ ముఖ్యమంత్రి అవుతానని ప్రకటించే శక్తి ఉన్నవాడు రేవంత్. ఎత్తుకు పై ఎత్తులు వేసి రేవంత్ మళ్లీ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురాగలరు. సౌత్ ఇండియాలో పార్టీ బలోపేతం కోసం రేవంత్ పని చేస్తున్నారు. రేవంత్ దూకుడును అడ్డుకోవడానికే ధర్మపురి అరవింద్ ప్రయత్నం చేస్తున్నారు. డి.శ్రీనివాస్ జీవిత కాలంలో 90 శాతం కాంగ్రెస్ పార్టీలోనే పని చేశారు. డీఎస్ కొడుకు అరవింద్.. సీఎం రేవంత్‌పై ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్నారు. సీఎం రేవంత్ ఇమేజ్ చెడగొట్టాలని చాలా మంది ప్రయత్నం చేస్తున్నారు' అని మల్లు రవి వ్యాఖ్యానించారు.

## తెలంగాణ ఉద్యోగులకు .. కొత్త హెల్త్ స్కీమ్ ఏర్పాటు చేసిన ప్రభుత్వం




**హైదరాబాద్, మే 19** : తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య భద్రత కోసం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ పెన్షనర్లకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కొత్తగా జుఎజూశ్రీశీఎవవ ఎముశ్రీస్త్ర ఝుతీవ ఎతీబర్ ఏర్పాటు చేసింది. ఈ కొత్త హెల్త్ స్కీమ్ అమల్లో భాగంగా రాష్ట్ర ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ అన్ని ప్రభుత్వ శాఖలకు అత్యవసర ఆదేశాలు జారీ చేసింది. ఈ పథకం ద్వారా ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు వైద్య భద్రత కల్పించడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యంగా తెలుస్తోంది. ఉద్యోగుల ఆరోగ్య సేవలను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక ట్రస్ట్ ఏర్పాటు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యోగుల పూర్తి సమాచారాన్ని సేకరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్ ప్రారంభించింది. ఫైనాన్స్ శాఖ సూచనల ప్రకారం ప్రతి ఉద్యోగి, పెన్షనర్ తమ కుటుంబ సభ్యుల వివరాలతో సహా పూర్తి డేటాను తప్పనిసరిగా సమర్పించాలి. భార్య, భర్త, పిల్లలు, ఆధారపడిన కుటుంబ సభ్యుల వివరాలు కూడా నమోదు చేయాలని స్పష్టం చేసింది. ఈ సమాచారం భవిష్యత్తులో ఆరోగ్య సేవలు, క్యాష్‌లెస్ చికిత్స వంటి ప్రయోజనాల అమలుకు ఉపయోగపడనుంది. అన్ని శాఖల అధికారులు ఉద్యోగుల వివరాలను **IFMIS-HR** పోర్టల్‌లో మే 31వ తేదీలోపు అప్‌లోడ్ చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. నిర్ణీత గడువులోపు సమాచారం నమోదు చేయని పక్షంలో భవిష్యత్తులో ఆరోగ్య పథకాల ప్రయోజనాలు పొందడంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్య భద్రతను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతోనే ఈ చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అమల్లో ఉన్న వైద్య పథకాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించి, వేగవంతమైన వైద్య సేవలు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం కొత్త విధానాన్ని రూపొందిస్తున్నట్లు సమాచారం. ఈ కొత్త హెల్త్ స్కీమ్‌తో ఉద్యోగులు, పెన్షనర్లు అత్యవసర వైద్య సేవలను సులభంగా పొందుతారని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు కూడా ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాయి. ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

## హైడ్రాపై హోంశాఖకు ఫిర్యాదులు

**హైదరాబాద్, మే 19**: తెలంగాణలో సంచలనం సృష్టిస్తున్న 'హైడ్రా' కార్యకలాపాలు ఇప్పుడు వివాదాస్పదంగా మారాయి. హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ హైడ్రా ముందుకు వెళ్తోందని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలంలోని సీయోట్ మారుతీ హిల్స్ కాలనీలో కోర్టు ఆదేశాలకు విరుద్ధంగా తవ్వకాలు జరుపుతున్నారని కాలనీ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆరోపించింది. బషీర్‌బాగ్‌లో జరిగిన సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. 1990-92 మధ్య ప్రైవేటు పట్టా భూములను కొనుగోలు చేసి, అన్ని అనుమతులతో కాలనీని అభివృద్ధి చేశామని తెలిపారు. అయితే, 2016లో ఎఫ్‌టీఎల్ పరిధిని తప్పుగా చూపడం వల్ల 86 మంది ప్లాట్ యజమానులు తీవ్రంగా నష్టపోతున్నారని వివరించారు. ఈ విషయంలో జనవరి 5న హైకోర్టు ఎటువంటి తవ్వకాలు చేపట్టవద్దని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ, హైడ్రా వాటిని లెక్కచేయకుండా పనులు కొనసాగిస్తోందని వారు పేర్కొన్నారు. మరోవైపు, హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై కేంద్ర హోం శాఖకు ఫిర్యాదు అందింది. సివిల్ సర్వీస్ నిబంధనలు-1968ని కమిషనర్ ఉల్లంఘించారని బీఆర్‌ఎస్ నేత ఎడ్ల సుధాకర్ రెడ్డి కేంద్ర హోం శాఖ అదనపు కార్యదర్శి రాకేశ్‌కుమార్ సింగ్‌కు ఫిర్యాదు చేశారు. అంబర్‌పేట మండలం సర్వే నంబర్ 563/1లోని బతుకమ్మకుంట భూవివాదం కోర్టు విచారణలో ఉండగా, ఆ అంశాలపై మీడియా ముందు తప్పుడు కథనాలు ప్రచారం చేస్తూ తన ప్రతిష్టను దెబ్బతీస్తున్నారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. కోర్టు పరిధిలో ఉన్న అంశాలను బహిరంగంగా చర్చించడం నిబంధనలకు విరుద్ధమని ఆయన విమర్శించారు. బాధితులకు న్యాయం చేయాలని , కోర్టు తీర్పులను గౌరవించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

## భూ భారతి పేరిట అసైన్డ్ భూములు కొల్లగొడుతున్న కాంగ్రెస్ నాయకులు

**హైదరాబాద్**: కాంగ్రెస్ నేతలు భూభారతి పేరిట అసైన్డ్ భూమునలను కొల్లగొడుతున్నారని బీఆర్ఎస్ నేత క్రిశాంక్ ఆరోపించారు. అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న అసైన్డ్ భూముల్లో ఎంపి వేం నరేందర్ రెడ్డి మైనింగ్ చేస్తున్నాడు. 2010లో, 2015లో వేం నరేందర్ రెడ్డి ఎలక్షన్ అఫిడవిట్లో అసైన్డ్ భూములు గురించి ఎక్కడా లేదు.. కాని 2026లోని ఎలక్షన్ అఫిడవిట్లో వాటి వివరాలు ఉన్నాయి. వేం నరేందర్ రెడ్డి భార్య విజయ లక్ష్మి పేరు మీద ఉన్న శ్రీ సాయి కృష్ణ గ్రానైట్స్ కంపెనీ కింద ఈ భూములు ఉన్నాయి. అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న అసైన్డ్ భూముల సర్వే నంబర్, శ్రీ సాయి కృష్ణ గ్రానైట్స్ కంపెనీ ఉన్న భూములు ఒకటే సర్వే నంబర్ కింద ఉన్నాయి. అవి అసైన్డ్ భూములని ఆర్డీవో, అడిషనల్ కలెక్టర్, కలెక్టర్ సంతకాలు కూడా ఉన్నాయి. ఇందులో కచ్చితంగా పాత మహబూబాబాద్ కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ప్రాత్ర కూడా ఉందని అయన అన్నారు. అందుకే వేం నరేందర్ రెడ్డి రాజ్య సభకి పోతు.. నువ్వు కూడా నా వెంట రా అని కలెక్టర్కి ఢిల్లీలోని తెలంగాణ భవన్లో స్పెషల్ సెక్రటరీ పదవి ఇప్పించాడని అన్నారు.

# గ్రేటర్ ఎన్నికలకు గులాబీ ప్లాన్

**హైదరాబాద్, మే 19**: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ, భాగ్యనగర రాజకీయం అప్పుడే వేడెక్కింది. జీహెచ్‌ఎంసీ పీఠంపై మరోసారి గులాబీ జెండాను ఎగురవేయడమే లక్ష్యంగా బీఆర్‌ఎస్ తన వ్యూహాలకు పదును పెడుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అధిక స్థానాలను సాధించి తన పట్టును నిరూపించుకున్న బీఆర్‌ఎస్, అదే జోష్‌తో మున్సిపల్ ఎన్నికల బరిలోకి దిగేందుకు సమాయత్తమవుతోంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వయంగా రంగంలోకి దిగి, ఓటర్ల జాబితా సవరణ నుంచి సభ్యత్వ నమోదు వరకు ప్రతి అంశాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటూ కేడర్‌కు దిశానిర్దేశం చేస్తున్నారు. గత ఎన్నికల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, తమ పార్టీ సానుభూతిపరులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి గల్లంతు కాకుండా బీఆర్‌ఎస్ పకడ్బందీ చర్యలు చేపట్టింది. కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియపై పార్టీ శ్రేణులను పూర్తిగా అలర్ట్ చేసింది. ఈ నెల 25 నుంచి ఈ ప్రక్రియ రాష్ట్రంలో ప్రారంభం కానుండటంతో, ప్రతి డివిజన్, పోలింగ్ బూత్ పరిధిలో ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలని కేటీఆర్ ఆదేశించారు. అయితే, ఈ ప్రక్రియను మానిటరింగ్ చేసేందుకు బూత్ లెవెల్ ఏజెంట్ల లిస్ట్ ఇవ్వాలని అధిష్టానం ఆదేశించగా, మొత్తం 119 నియోజకవర్గాల్లో 38 నియోజకవర్గాల నుంచి ఇంకా లిస్ట్ అందకపోవడంపై




ఇటీవల పార్టీ అధినేత కేసీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిని సీరియస్‌గా తీసుకున్న కేటీఆర్.. గ్రేటర్ హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలకు చెందిన ముఖ్య నేతలతో అత్యవసర సమావేశం నిర్వహించారు. గులాబీ క్యాడర్ బలంగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలని స్పష్టం చేశారు. కొత్త ఓటర్ల నమోదు, తప్పుల సవరణ, అర్హులైన ఓటర్ల వద్ద అవసరమైన అర్హత పత్రాలు ఉండేలా చూసే బాధ్యతను ఈ బీఎల్‌ఏలకు అప్పగించారు. 2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో బీఆర్‌ఎస్ అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంది. గతంలో వరుసగా రెండు సార్లు గ్రేటర్ మేయర్ పీఠాన్ని కూడా దక్కించుకుంది. ఈ నేపథ్యంలో ఎస్ఐఆర్ ప్రక్రియ వల్ల ఈ జిల్లాల్లోని ఓటర్లు ఎక్కువగా ప్రభావితం అయ్యే అవకాశం ఉందని భావించి, ముస్లిం మైనారిటీ ఓటు బ్యాంకుపై పార్టీ ప్రత్యేక దృష్టి సారించింది. పాతబస్తీ మినహా మిగిలిన అన్ని ప్రాంతాల్లో మైనారిటీలు బీఆర్‌ఎస్ వైపే నిలిచారు. అందుకే, తమ పార్టీ ఎమ్మెల్యేలు ఉన్న చోటా, లేని చోటా బూత్ ల వారీగా బీఎల్ఏలను నియమించి సానుకూల ఓట్లను కాపాడుకునేందుకు క్షేత్రస్థాయి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకు వేచి చూడకుండా, ప్రజల్లోనే ఉండాలని మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, డివిజన్ ఇంచార్జీలను కేటీఆర్ ఆదేశించారు. గ్రేటర్ పరిధిలోని ప్రధాన సమస్యలైన డ్రైనేజీ వ్యవస్థ లోపాలు, తాగునీటి ఎద్దడి, దెబ్బతిన్న రోడ్లు, స్థానిక మౌలిక వసతుల కల్పనలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు... లాంటి వాటిని ఎండగడుతూ ప్రజల్లోకి వెళ్లాలని దిశానిర్దేశం చేశారు. తెలంగాణ భవన్ వేదికగా కేటీఆర్ ఈ మొత్తం వ్యవహారాన్ని స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. దీనితో పాటు, డిజిటల్ పద్ధతిలో ప్రతి ఇంటిని టచ్ చేస్తూ ముమ్మరంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించాలని స్పష్టం చేశారు. ఎన్నికలకు ముందే వ్యూహాత్మక అడుగులు వేస్తూ, కేడర్‌లో జోష్ నింపుతున్న గులాబీ బాస్ ల చర్యలు గ్రేటర్ రాజకీయాల్లో సరికొత్త వేడిని పుట్టిస్తున్నాయి. రాబోయే మున్సిపల్ పోరులో గ్రేటర్ కోటపై మళ్లీ గులాబీ జెండా ఎగురుతుందో లేదో చూడాలి.

# అమీర్ పేట జంక్షన్ లో ఎన్టీఆర్ విగ్రహం..

**హైదరాబాద్, మే 19**: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సందర్భంగా తాను మాట ఇచ్చినట్లు టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. హైదరాబాద్ నగరంలోని అత్యంత రద్దీగా ఉండే అమీర్ పేట చౌరస్తాలో తెలుగువారి అన్న ఎన్టీఆర్ విగ్రహం ప్రతిష్టించేందుకు పనులు ప్రారంభమయ్యాయి. సెటిలర్లు, టీడీపీ సానుభూతిపరులు, ఎన్టీఆర్ అభిమానుల ఓట్లే టార్గెట్ గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయంలో వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారని అంటున్నారు. తెలంగాణ గడ్డపై టీడీపీ అనుకూల వ్యాఖ్యలు చేస్తే రాజకీయంగా నష్టం జరుగుతుందనే అనుమానాలను పటాపంచలు చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి అడుగులు వేస్తున్నారని వ్యాఖ్యానిస్తున్నారు. అమీర్‌పేట్ లోనే కాకుండా, హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో 'ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ' వంద అడుగుల విగ్రహానికి సీఎం రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోవడంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. తెలుగుజాతి గర్వించదగ్గ మహానాయకుడు, దివంగత నేత నందమూరి తారక రామారావు అంటే రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రజలకు ఒక ఎమోషన్. పార్టీలకు అతీతంగా అన్నగారిని ఆరాధించే కోట్లాది మంది అభిమానులు రెండు రాష్ట్రాల్లో ఉన్నారు. ఎన్టీఆర్ అభిమానులు ఎక్కువగా ఆయన స్థాపించిన టీడీపీకి అనుకూలంగా ఉంటారు. అయితే తెలంగాణ ఏర్పాటు తర్వాత టీడీపీ ఉనికి కోల్పోగా, ఆ పార్టీ సానుభూతిపరులు, అభిమానులు మాత్రం తరచూ తమ ప్రభావం చూపడానికి ప్రయత్నిస్తుంటారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతుంటారు. ప్రధానంగా హైదరాబాద్ నగరంలో భారీగా ఉండే టీడీపీ సానుభూతిపరులను ఆకర్షించడానికి తెలంగాణ పార్టీలు విస్తృతంగా ప్రయత్నిస్తుంటాయి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఈ విషయమై పెద్ద డిబేట్ కూడా కొనసాగింది. ఆ సమయంలో కీలకమైన టీడీపీ సానుభూతిపరుల ఓటర్లను కైవసం చేసుకోడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యూహాత్మకంగా పావులు కదిపారు. అమీర్‌పేట్ లో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేస్తున్నారు. రేవంత్ రెడ్డి ఇక ఎన్నికల ప్రచార సమయంలో అమీర్‌పేట్ జంక్షన్ వద్ద సీనియర్ ఎన్టీఆర్ భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకునేలా ప్రస్తుతం పనులు మొదలయ్యాయి. ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ఆధ్వర్యంలో విగ్రహ ఏర్పాటు పనులు తాజాగా ప్రారంభించారు. ప్రస్తుతం పునాది పనులను ప్రారంభించారని ఇది పూర్తయిన వెంటనే విగ్రహాన్ని ఏర్పాటు చేసి అవిష్కరిస్తారని అంటున్నారు. హైదరాబాద్‌లో అమీర్‌పేట్, మైత్రీవనం ప్రాంతాలంటే నిత్యం లక్షలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు, సాధారణ ప్రజలతో కిటకిటలాడే అత్యంత కీలకమైన జంక్షన్లు. అలాంటి చోట ఎన్టీఆర్ విగ్రహాన్ని ప్రతిష్ఠించడం వెనుక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యూహాత్మక రాజకీయ అడుగులు ఉన్నాయనే చర్చ



నడుస్తోంది. తెలుగుదేశం పార్టీ నుంచి తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ఆ పార్టీ ఓటర్లను కాంగ్రెస్ వైపు మళ్లించే ప్రణాళికలో భాగంగా పకడ్బందీగా వ్యూహం రచిస్తున్నారని అంటున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రంలో టీడీపీ తిరిగి బలపడటం సాధ్యం కాదని, టీడీపీ ఓటర్లు తన నాయకత్వం కిందకు రావాలని బలమైన సంకేతాలు పంపేలా సీఎం రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారని విశ్లేషిస్తున్నారు. ఈ వ్యూహం అమలులో భాగంగా అమీర్‌పేట్ లో విగ్రహం ఏర్పాటుకు చకచకా పనులు జరుగుతున్నాయని, మరోవైపు ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో 'ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ' ప్రతిపాదించిన 100 అడుగుల ఎన్టీఆర్ విగ్రహం, ఎన్టీఆర్ నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటుకు కూడా సానుకూల నిర్ణయం తీసుకున్నారని అంటున్నారు.

## ట్రాన్స్ ఫర్ చేసిన అరగంటలోనే రివర్స్...

### సైబరాబాద్ కమిషనరేట్ లో ఏం జరుగుతోంది

**హైదరాబాద్, మే 19**: శాంతిభద్రతల పరిరక్షణలో రాష్ట్రంలోనే అత్యంత కీలకమైన, ప్రతిష్ఠాత్మకమైన సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఇప్పుడు బదిలీల గందరగోళంలో కొట్టుమిట్టాడుతోంది. పరిపాలనాపరమైన సమన్వయ లోపమో, లేక అంతర్గత ఒత్తిళ్లకు తలొగ్గడమో తెలియదు కానీ, ఇటీవల తీసుకున్న కొన్ని నిర్ణయాలు పోలీస్ శాఖలోనే తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. కాగితాలపై బదిలీల ఫైళ్లు పరుగులు పెడుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం స్టేషన్లు వెలవెలబోతున్నాయి. ఫలితంగా సిబ్బంది కొరతతో ఐటీ కారిడార్లో పోలీసింగ్ వ్యవస్థ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. మే 2న సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఒకేసారి 65 మంది ఇన్స్పెక్టర్లను బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సాధారణంగా ఇలాంటి భారీ బదిలీల వెనుక వారం రోజుల పాటు తీవ్రస్థాయిలో కసరత్తు జరుగుతుంది. కానీ, ఏమైందో ఏమో తెలీదు కానీ.. ఉత్తర్వులు వెలువడిన కొద్ది గంటల్లోనే ఆ ఆర్డర్లను నిలిపివేస్తూ (హోల్డ్లో పెడుతూ) మరో ఆదేశం రావడం డిపార్ట్మెంట్లో కలకలం రేపింది. ఆర్డర్ వచ్చింది.. సీట్ మారుతుందనుకునే లోపే బ్రేక్ పడింది' అంటూ ఇన్స్పెక్టర్లు సైతం తలలు పట్టుకునే పరిస్థితి వచ్చింది. ఈ వెనకడుగు వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయా? లేక అంతర్గత వ్యూహాత్మక లోపాలు ఉన్నాయా? అనే చర్చ జోరుగా సాగుతోంది. ఇన్స్పెక్టర్ల బదిలీల వ్యవహారం ఒక కొలిక్కి రాకముందే.. కమిషనరేట్ పరిధిలోని 32 మంది సబ్‌ఇన్స్పెక్టర్లను (ఎస్ఐలను) జోన్-6 చార్మినార్కు సరెండర్ చేస్తూ హుటాహుటిన ఉత్తర్వులు జారీ అయ్యాయి. పైగా, ఆర్డర్లు వచ్చిన వెంటనే వారందరినీ రిలీవ్ చేయడంతో వారంతా కొత్త ప్రాంతాల్లో రిపోర్ట్ చేయడానికి వెళ్ళిపోయారు. దీనికి బదులుగా హైదరాబాద్ సిటీ నుంచి మరో 32 మంది ఎస్ఐలను సైబరాబాద్కు కేటాయించాలనే ప్రతిపాదనలు అయితే సిద్ధం చేశారు కానీ, వారు క్షేత్రస్థాయిలో విధుల్లో చేరడానికి ఇంకా ముహూర్తం కుదరలేదు. వెళ్ళిన వారు వెళ్ళిపోయారు.. రావాల్సిన వారు రాలేదు. మధ్యలో స్టేషన్లలోఉన్న సీట్లు ఖాళీగా ఉండిపోయాయి. దీనివల్ల మిగిలిన సిబ్బందిపై పనిభారం రెట్టింపు అయ్యింది. గ్లోబల్ సిటీగా ఎదుగుతున్న




హైదరాబాద్కు గుండెకాయ లాంటి ఐటీ కారిడార్ పరిధిలోని పోలీస్ స్టేషన్లపై ఈ బదిలీల ప్రభావం తీవ్రంగా పడింది. మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం, నార్సింగి, కూకట్పల్లి, బాచుపల్లి. అంతర్జాతీయ స్థాయి ఐటీ కంపెనీలు, లక్షలాది మంది ఉద్యోగుల రాకపోకలు, నిత్యం ట్రాఫిక్ జాంలు, వీఐపీల బందోబస్తులు, హై-ప్రొఫైల్ నేరాలు. ఇలాంటి అత్యంత సున్నితమైన, బిజీ స్టేషన్లలో ఎస్ఐల కొరత స్పష్టంగా కనిపిస్తోంది. శాంతిభద్రతల పరిరక్షణ, క్రైమ్ ఇన్వెస్టిగేషన్, రాత్రి పూట పెట్రోలింగ్, బాధితుల నుంచి ఫిర్యాదుల స్వీకరణ వంటి బాధ్యతలను కొద్దిమంది సిబ్బందే అదనపు షిఫ్టులు చేస్తూ నిర్వహించాల్సి వస్తోంది. సుదీర్ఘ గంటల పనివల్ల క్షేత్రస్థాయి సిబ్బంది తీవ్ర మానసిక, శారీరక ఒత్తిడికి లోనవుతున్నారు. సాధారణంగా పోలీసు సిబ్బంది లో ఒకరిని బదిలీ చేసినప్పుడు, ఆ స్థానంలో మరొకరు వచ్చి చేరేవరకు పాతవారిని రిలీవ్ చేయకూడదనేది' కనీస పరిపాలనా నియమం. కానీ సైబరాబాద్లో మాత్రం కాగితాల్లో భర్తీ చూపిస్తూ, క్షేత్రస్థాయిని ఖాళీ చేసేశారు. ఐటీ కారిడార్ లాంటి సున్నితమైన ప్రాంతాల్లో ఇలాంటి భద్రతా లోపాలు లేదా సిబ్బంది కొరత కొనసాగితే.. భవిష్యత్తులో అది శాంతిబద్రతల సమస్యలకు దారితీసే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, గందరగోళానికి గురైన బదిలీల ప్రక్రియను క్రమబద్ధీకరించి, ఐటీ కారిడార్ స్టేషన్లకు తక్షణమే పూర్తిస్థాయి సిబ్బందిని కేటాయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


## లులు హైపర్ మార్కెట్ లో నాసిరకం నిల్వలు

### పలు ఆహార పదార్థాలతో పురుగులు

**హైదరాబాద్**: కూకట్పల్లి లులు హైపర్మార్కెట్లో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు జరిపారు. పలు ఆహార పదార్థాల్లో పురుగులు, నాసిరకం నిల్వలు గుర్తించారు. కిచెన్లో అపరిశుభ్రత, పాడైపోయిన కూరగాయలు, పురుగుల సంచారం వెలుగులోకి వచక్చాయి. గడువు సమీపించిన ఆహార పదార్థాలపై తప్పుదారి పట్టించే లేబుళ్ల వున్నట్లు అధికారులు గుర్తించారు. శనగపిండి, ఆటా, పప్పుల్లో పురుగులను గుర్తించారు. గడువు ముగిసిన ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్తో ప్యాక్డ్ ఫుడ్ విక్రయం నడుస్తోంది. మాంస వ్యర్థాలతో మూసుకుపోయిన డ్రెయిన్లు వున్నాయి. సుమారు 150 కిలోల ఆహార పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. కల్తీ, అధిక కృత్రిమ రంగుల అనుమానంతో ఆహార నమూనాలు సేకరించారు.

## కూకట్‌పల్లి లులు హైపర్ మార్కెట్లో అధికారుల తనిఖీలు..

### 150 కిలోల ఆహార పదార్థాల సీజ్




**హైదరాబాద్, మే 19**: నగరంలో కూకట్‌పల్లిలోని లులు హైపర్ మార్కెట్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజారోగ్యానికి హాని కలిగించే విధంగా ఉన్న దాదాపు 150 కిలోల ఆహార పదార్థాలను వారు సీజ్ చేశారు. మంగళవారం ఈ హైపర్ మార్కెట్‌లో తనిఖీలు చేపట్టిన అధికారులకు.. పలు ఆహార పదార్థాల్లో పురుగులు ఉండటాన్ని గుర్తించారు. అలాగే నాసిరకం ఆహార పదార్థాలు నిల్వ చేసినట్లు కనుగొన్నారు. కిచెన్ అపరిశుభ్రంగా ఉండడాన్ని అధికారులు గుర్తించారు. పాడై పోయిన కూరగాయలతోపాటు పరిసర ప్రాంతాలలో పురుగులు సంచరిస్తున్నట్లు ఈ తనిఖీల్లో అధికారులు గమనించారు. గడువు సమీపించిన ఆహార పదార్థాలపై తప్పుదారి పట్టించే విధంగా లేబుళ్లు అతికించినట్లు గుర్తించారు. గడువు ముగిసిన ఎఫ్ఎస్ఎస్ఏఐ (ఖీూూా×) లైసెన్స్‌తో ప్యాక్‌డ్ ఫుడ్ విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఈ హైపర్ మార్కెట్ నుంచి బయటకు వెళ్లే డ్రైనేజ్ కూడా మాంసాహార వ్యర్థాలతో మూసుకుపోయినట్లు ఈ తనిఖీల్లో తేలింది. కల్తీ, అధిక కృత్రిమ రంగుల అనుమానంతో పలు ఆహార పదార్థాల నమూనాలను కూడా అధికారులు సేకరించారు.

# బండి భగీరథ్ కేసులో క్రెడిట్ వార్

**హైదరాబాద్, మే 19:** బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో పెను తుపానును సృష్టిస్తోంది. ఈ కేసు కేవలం చట్టపరమైన పరిధిని దాటిపోయి రాజకీయంగా మారింది. బీజేపీ, కాంగ్రెస్ ను ఒకే గాటన కట్టేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది. మరో వైపు అధికార కాంగ్రెస్ , బీజేపీ మధ్య ఒక హై-వోల్టేజ్ మైండ్ గేమ్ కు వేదికైంది. తెలంగాణ రాజకీయాలు ఇప్పుడు బండి భగీరథ్ కేసు చుట్టూ తిరుగుతున్నాయి. బీజేపీ దశ మారుస్తారని భావిస్తున్న కీలక నేత కుమారుడు కావడం.. భగీరథ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు కావడం, ఆయన లొంగిపోవడం వంటి పరిణామాలు రాష్ట్రంలో రాజకీయ వేడిని పెంచాయి. ఈ కేసును కాంగ్రెస్ సర్కార్ ఒక బలమైన రాజకీయ ఆయుధంగా మలచుకుంటుండగా, బీజేపీ దీనిని హనీ ట్రాప్‌గా అభివర్ణిస్తూ ఎదురుదాడికి దిగుతోంది. అదే సమయంలో బీఆర్ఎస్ రెండు పార్టీలు కలిసి బాధితురాలికి అన్యాయం చేస్తున్నాయని ఆరోపిస్తోంది. బండి సంజయ్ బర్తరఫ్‌కు కేటీఆర్ డిమాండ్ చేస్తున్నారు. ఆయన మంత్రిగా ఉంటే.. కేసును ప్రభావితం చేస్తారని అంటున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయంలో అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. కేసు నమోదైన నాటి నుంచే దర్యాప్తులో ఎందుకు జాప్యం జరుగుతోందని డీజీపీని ప్రశ్నించడం ద్వారా, తన ప్రభుత్వం చట్టం అమలులో ఎవరికీ మినహాయింపు ఇవ్వదని గట్టి సందేశం పంపారు. కేంద్ర మంత్రి కుమారుడైనా సరే వదిలేది లేదని చెప్పడం ద్వారా, ప్రజల్లో తన ఇమేజ్‌ను పెంచుకోవడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. ముఖ్యంగా మహిళల భద్రత, పోక్సో కేసుల తీవ్రతను ప్రస్తావిస్తూ బీజేపీని ఆత్మరక్షణలో పడేసేలా కాంగ్రెస్ తన సోషల్ మీడియా విభాగాన్ని రంగంలోకి దింపింది. మరోవైపు బీజేపీ ఈ కేసును నేరుగా బండి సంజయ్ రాజకీయ ప్రతిష్టపై జరిగిన దాడిగా చిత్రీకరిస్తోంది. ప్రధాని మోదీ సభ , హిందూ ఏక్తా యాత్రల సమయంలోనే ఈ కేసును వెలుగులోకి తేవడం వెనుక లోతైన కుట్ర ఉందని




బండి సంజయ్ ఆరోపిస్తున్నారు. నన్ను రాజకీయంగా ఎదుర్కోలేకే నా కుమారుడిని టార్గెట్ చేశారు అనేది బీజేపీ ప్రధాన వాదన. అంతేకాకుండా, బాధితురాలు మైనర్ కాదని, ఆమెకు రెండు వేర్వేరు పుట్టిన తేదీ ధృవీకరణ పత్రాలు ఉన్నాయనే వార్తలను బీజేపీ సోషల్ మీడియాలో వైరల్ చేస్తూ వచ్చింది. అయితే బీజేపీకి ఏదీ కలసి రాలేదు. బాధితురాలు మైనర్‌గా తేలడంతో జైలుకు వెళ్లక తప్పలేదు. ఈ గొడవ వల్ల క్షేత్రస్థాయిలో బీజేపీ కార్యకర్తలు మరింత దూకుడుగా వ్యవహరిస్తున్నారు. ఇది కేవలం భగీరథ్ వ్యక్తిగత విషయం కాదని, పార్టీ గౌరవానికి సంబంధించిన అంశంగా వారు భావిస్తున్నారు. కాంగ్రెస్ మాత్రం తన న్యాయ పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి దీనిని ఒక ఉదాహరణగా చూపిస్తోంది. ఈ రెండు పార్టీలను ప్రజల్లో దోషులుగా నిరూపించాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది. రాబోయే రోజుల్లో ఈ కేసు దర్యాప్తు వేగం పుంజుకునే కొద్దీ తెలంగాణ రాజకీయం మరిన్ని మలుపులు తిరగడం ఖాయం.

**కొత్త కేసులతో ఇబ్బందులు**

బండి సాయి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో పోలీసులు మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. దర్యాప్తు ముమ్మరం చేసిన కొద్దీ ఈ కేసులో రోజుకో కొత్త ట్విస్ట్ వెలుగులోకి వస్తోంది. తాజాగా ఈ కేసులో పోలీసులు నిందితుడు బండి భగీరథ్‌పై మరింత కఠినమైన బీఎన్ఎస్ సెక్షన్‌ను జోడించారు. ఒకే బాధితురాలిపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడినట్లు అభియోగాలు ఉండటంతో పోలీసులు ఈ కొత్త సెక్షన్‌ను నమోదు చేసినట్లు తెలుస్తోంది. ఈ కేసుకు సంబంధించి బండి భగీరథ్‌పై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) లోని 64(2)(ఎ) సెక్షన్‌ను అదనంగా చేర్చారు. తీవ్రమైన నేరాలకు సంబంధించిన ఈ సెక్షన్‌ను జోడించడంతో నిందితుడికి చట్టపరంగా ఇబ్బందులు మరింత పెరిగే అవకాశం ఉందని న్యాయ నిపుణులు భావిస్తున్నారు. ఈ కొత్త కేసు ప్రకారం తప్పు చేసినట్లు రుజువైతే భగీరథ్‌కు 10 ఏళ్ల వరకు జైలుశిక్ష పడుతుందని తెలుస్తోంది. బాధితురాలి నుంచి సేకరించిన మరికొన్ని వివరాలు, సాంకేతిక ఆధారాల ప్రకారమే పోలీసులు ఈ చర్యలు చేపట్టినట్లు సమాచారం. మరోవైపు, ప్రస్తుతం రిమాండ్ ఖైదీగా చర్లపల్లి జైలులో శిక్ష అనుభవిస్తున్న బండి సాయి భగీరథ్‌ను కలిసేందుకు ఆయన కుటుంబ సభ్యులు సిద్ధమయ్యారు. జైలు నిబంధనల ప్రకారం నేడు వారు చర్లపల్లి జైలుకు వెళ్లి ములాఖత్ ద్వారా భగీరథ్‌ను కలవనున్నారు. కఠినమైన సెక్షన్లు తోడవడంతో తదుపరి లీగల్ ప్రాసెస్, బెయిల్ పిటిషన్లపై ఈ ములాఖత్‌లో కుటుంబ సభ్యులు, న్యాయవాదులు చర్చించే అవకాశం ఉందిబండి భగీరథ్ పోక్సో కేసులో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. గత కొన్ని రోజులుగా సోషల్ మీడియా వేదికగా నిందితుడికి మద్దతుగా విపరీతంగా ప్రచారం నిర్వహిస్తూ, అతడు నిర్దోషి అని చిత్రీకరించే ప్రయత్నం చేసిన పలువురు సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లపై కేసులు నమోదయ్యాయి. ఈ వ్యవహారంలో మొత్తం 27 మంది ఇన్‌ఫ్లూయెన్సర్లపై ఫిర్యాదులు రాగా, ప్రాథమిక విచారణ అనంతరం అందులో 14 మందిపోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మిగిలిన వారిపై కూడా దర్యాప్తు కొనసాగుతోందని, త్వరలోనే తదుపరి చర్యలు తీసుకుంటారని అధికారులు తెలిపారు.

# కేసీఆర్-జగన్-విజయ్ రీజనల్ ఫ్రంట్...

ఒక తాజా ముఖ్యమంత్రితో చేతులు కలిపి ఇద్దరు మాజీ ముఖ్యమంత్రులు తమ రాజకీయ పునరుత్తేజం పొందాలని చూస్తున్నారా. ఏకంగా సౌత్‌లో రీజనల్ రెలీజియన్ ఫ్రంట్ కి శ్రీకారం చుట్టాలని భావిస్తున్నారా అంటే జరుగుతున్న ప్రచారం బట్టి చూస్తే అవును అనే మాట వస్తోంది. ఆ పార్టీలు బీఆర్ఎస్, వైసీపీ టీవీకే అయితే అధినాయకులు కేసీఆర్ జగన్ విజయ్ అని అంటున్నారు. ఇందులో కేసీఆర్ రెండు సార్లు తెలంగాణాకు సీఎం గా చేసి ఓటమి పాలు అయ్యారు. ఏపీలో ఒకసారి అధికారంలోకి వచ్చిన జగన్ కూడా రెండేళు ్ళగా మాజీ సీఎం గా ఉన్నారు. ఇక రెండేళ్ళ క్రితం పార్టీ పెట్టి తాజాగా తమిళనాడు ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన విజయ్ ఇపుడు కేసీఆర్ జగన్ భవిష్యత్తు రాజకీయాకు ఒక ఆశాకిరణంగా కనిపిస్తున్నారు అని అంటున్నారుతెలుగు రాజకీయాల్లో కొత్త సమీకరణలకు ప్రధాని నరేంద్ర మోడీ తాజా పర్యటన దారి తీసింది. ఇక్కడ ఒక విషయం ఫుల్ క్లారిటీ వచ్చింది. ఎన్డీయే బంధం మరింత పటిష్టం అయింది అని. పైగా టీడీపీ బీజేపీ జనసేన 2029 లో కూడా కలసికట్టుగా సాగుతాయని అర్ధం అవుతోంది. అంతే కాదు ఈ మోడీ బాబు పవన్ ల మధ్య మిత్ర బంధం మరింత బలీయం అయింది. దాంతో వచ్చే ఎన్నికల నాటికి తెలంగాణాలో బీఆర్ఎస్ తో బీజేపీ కలుస్తుందన్న ప్రచారం పూర్తిగా పక్కకు పోయింది. అలాగే ఏపీలో వైసీపీతో ఏదో నాటికి బీజేపీ స్నేహ హస్తం గట్టిగా అందిస్తుందన్న అశలూ అడుగంటాయని అంటున్నారు. ఈ నేపథ్యంలో ఎన్డీయేకు దూరంగా ఉండాల్సిన పరిస్థితి వైసీపీకి అనివార్యంగా కనిపిస్తోంది. ఇంత జరిగిన తరువాత కూడా ఎన్డీయేకు మద్దతు పరోక్షంగా అయినా ఇస్తూ పోతే అది పార్టీ జనంలో బయట జనంలో తప్పుడు సంకేతాలు ఇచ్చే చాన్స్ ఉంటుంది. వాటికి మించి వైసీపీకి బలంగా ఒక్క మైనారిటీ ఎస్సీ ఎస్టీ ఓటు బ్యాంక్ కూడా రివర్స్ అవుతుందన్న చర్చ కూడా ఉందని అంటున్నారు. ఇక ఏపీలో 2029 ఎన్నికల్లో బాబు పవన్ మోడీల త్రిమూర్తులను వైసీపీ అధినేత జగన్ మరోసారి ఎదుర్కోవాల్సిన పరిస్థితి అయితే ఉంది. దాంతో వైసీపీ ఇక మూడేళ్ళు ముందుగానే తన రాజకీయ యాక్షన్ ప్లాన్ ని రెడీ చేసుకోవాల్సిన సమయం వచ్చేసింది అని అంటున్నారు. తెలంగాణాలో కేసీఆర్ విషయం తీసుకుంటే



కాంగ్రెస్ అక్కడ స్థానికంగా అధికారంలో ఉంది. దాంతో జాతీయ స్థాయిలో కాంగ్రెస్ తో నేరుగా చేతులు కలపలేని పరిస్థితి ఉంది. అలాగని బీజేపీతో కలసి ముందుకు సాగే సీన్ కూడా లేదు, బీజేపీతో బాహాటంగా కలిస్తే మైనారిటీ ఓట్లు ఇతర అణగారిన వర్గాల ఓట్లు పోతాయన్న భయం ఉంది. అయితే బీజేపీ పట్ల ఎంతో కొంత సాఫ్ట్ కార్నర్ తో అయితే బీఆర్ఎస్ ఉందన్న ప్రచారాన్ని కాంగ్రెస్ వర్గాలు ఇంతకాలం చేస్తూ వచ్చాయి. అందులో నిజమెంత ఉందో తెలియదు కానీ ఇపుడు మాత్రం మోడీ బాబు పవన్ తెలంగాణాలో కూడా ఎన్డీయే గా ముందుకు వస్తే మాత్రం బీఆర్ఎస్ కొత్త ఆలోచనలు చేయాల్సిందే అన్నది కూడా గులాబీ పార్టీలో ఉంది: ఇదిలా ఉంటే జాతీయ స్థాయిలో ఇండియా కూటమి వైపు కేసీఆర్ జగన్ చూపు పడుతోందా అన్న చర్చ కూడా ఉంది. ఎంత లేదనుకున్నా కాదనుకున్నా జాతీయ రాజకీయాన్ని కూడా గమనిస్తూ ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. అంతే కాదు తెలంగాణాలో ఏకంగా మోడీయే రంగంలోకి దిగితే ప్రాంతీయ పార్టీలతో అయినా చెలిమి చేయడం ద్వారా బలం పెంచుకోవాలన్నది బీఆర్ఎస్ ఆలోచనగా ఉంది అని అంటున్నారు. దాంతోనే తమిళనాడు కొత్త ముఖ్యమంత్రి టీవీకే అధినేత విజయ్ తో స్నేహం నెరిపే విషయంలో బీఆర్ఎస్ ఉత్సాహం చూపిస్తోంది అని అంటున్నారు. అదే సమయంలో వైసీపీ అధినేత జగన్ కూడా విజయ్ తో చెలిమి చేస్తున్నారు. ఇలా రెండు తెలుగు రాష్ట్రాలలో రెండు కీలక పార్టీలు ఇపుడు జాతీయ రాజకీయాల్లో కొత్త రూట్ లోకి వెళ్తున్నాయా అన్న చర్చ సాగుతోంది. నిజానికి ఈ రోజున దేశ రాజకీయాలలో ప్రాంతీయ పార్టీలు తమ వంతు పాత్ర పోషిస్తున్నాయి. ఎన్డీయేలో జనసేన టీడీపీ ఉంటే మరి కొన్ని పార్టీలు కాంగ్రెస్ నాయకత్వంలోని ఇండియా కూటమిలో ఉన్నాయి. అయితే ఈ రెండు కూటములలో లేని ఉండలేని ప్రాంతీయ పార్టీలుగా తెలుగు నాట బీఆర్ఎస్ వైసీపీలను చెప్పుకోవాలి. ఈ రెండు పార్టీలకు కాంగ్రెస్ రాజకీయ ప్రత్యర్ధి. దాంతో ఇండియా కూటమిలోకి కలవలేరు, అలాగే ఎన్డీయే నాయకత్వంలోని కూటమిలో కూడా చేరలేరు. దాంతో తమకు తాముగా దక్షిణాదిన ఒక ప్రాంతీయ కూటమిని ఏర్పాటు చేసుకుంటే రేపటి రోజున అంటే 2029 ఎన్నికల్లో ఏ పార్టీకి ప్రభుత్వాన్ని కేంద్రంలో ఏర్పాటు చేయడానికి అవసరమైన సీట్లు రాకపోతే తమ బలం అవసరం అవుతుందని అలా తమకు డిమాండ్ ఉంటుందని ఒక కొత్త ప్రయత్నానికి సిద్ధపడుతున్నట్లుగా తెలుస్తోంది. ఇక తమిళనాడులో విజయ్ పార్టీ గెలవడం ఏంటి అటు బీఆర్ఎస్ ఇటు వైసీపీ కూడా పెద్ద ఎత్తున రియాక్ట్ అయిపోయాయి. అంతే కాదు విజయ్ కి కంగ్రాట్స్ చేస్తూ చెలిమికి తెర తీశాయి. ఇక్కడ వైసీపీకి టీవీకేకి సిద్ధాంతపరంగా సారూప్యం కంటే రెండు పార్టీలకూ క్రిస్టియన్ మైనారిటీ ఓటు బేస్ మాత్రం ఒక కామన్ పాయింట్ గా చెబుతున్నారు. ఇక సంక్షేమ పథకాలు ఇతర అంశాలలో జగన్ స్ట్రాటజీని విజయ్ ఫాలో అవుతున్నారని కూడా అంటున్నారు. ఇవన్నీ పక్కన పెడితే ఏపీలో చంద్రబాబు పవన్ కళ్యాణ్ లతో కూడిన బీజేపీ కూటమిని ఢీ కొట్టాలంటే ఈ సఖ్యత కొత్త కూటమి అవసరం అని వైసీపీ భావిస్తూంటే తెలంగాణాలో కూడా దూసుకుని వస్తున్న బీజేపీని ఎన్డీయే కూటమి ఏర్పాటుని అడ్డుకోవడానికి బీఆర్ఎస్ కూడా విజయ్ వంటి మిత్రుడి వైపు చూస్తోంది అని అంటున్నారు. ఇది కేసీఆర్ కి జగన్ కి రాజకీయ అనివార్యంగా కనిపిస్తుంది అని అంటున్నారు. ఏపీలో చూస్తే పార్టీగా వైసీపీని పెట్టక ముందు నుంచే జగన్ మీద అవినీతి ఆరోపణలు ఉన్నాయి. ఆయన మీద సీబీఐ కేసులు పదహారు నెలల జైలు జీవితం ఇవన్నీ ఒక ఎత్తు అయితే 2019 నుంచి 2024 దాకా సాగిన అయిదేళ్ల వైసీపీ ఏలుబడిలో అవినీతి మరో ఎత్తు అని అంటున్నారు. దాని వల్లనే వైసీపీ 2024 లో ఓటమి పాలు అయిందని చెబుతారు.

## 28 నుంచి భారీగా
# పెరగనున్న ధరలు

- మొదటి పేజీ తరువాయి

ప్రాంతాలు, జాతీయ రహదారులు, పట్టణాలకు సమీపంలో ఉన్న సాగు, సాగేతర స్థిరాస్తుల విలువలను సగటున 50 శాతం వరకు పెంచాలని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ నిర్ణయించింది. బహిరంగ మార్కెట్ ధరలకు, సర్కారు నిర్ణయించిన విలువలకు మధ్య కొండంత వ్యత్యాసం ఉండటమే దీనికి ప్రధాన కారణం. ప్రముఖ ఆర్థికవేత్త అరవింద్ సుబ్రహ్మణ్యం కమిటీ సిఫార్సులను పరిగణనలోకి తీసుకుని ఈ ప్రక్రియను చేపడుతుండగా.. ప్రజలపై ఒకేసారి భారీ భారం పడకుండా ఉండాలని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులకు స్పష్టం చేశారు. ఈ నెల 28 నుంచే కొత్త రేట్లను అమల్లోకి తెచ్చే అవకాశం ఉంది. ఈ సవరణ ప్రకారం.. రాష్ట్రంలో ప్రస్తుతం ఎకరా వ్యవసాయ భూమి కనిష్ఠ ప్రభుత్వ విలువ రూ.1.75 లక్షలు ఉండగా.. దానిని రూ.2.75 లక్షలకు పెంచనున్నారు. ఇక ఓఆర్ఆర్ పరిధి లోపల డిమాండ్ ఎక్కువగా ఉన్నందున ఎకరా కనిష్ఠ విలువను రూ.8.75 లక్షల నుంచి రూ.15 లక్షలకు పెంచాలని నిర్ణయించారు. వట్టినాగులపల్లి వంటి హాట్ స్పాట్లలో బహిరంగ మార్కెట్ ధర ఎకరాకు రూ.100 కోట్లకు పైగా పలుకుతుండగా.. ప్రస్తుతం అక్కడ కేవలం రూ.2 నుంచి రూ.2.5 కోట్లుగా ఉన్న ప్రభుత్వ విలువను రూ.4 కోట్లకు సవరించనున్నారు. హైదరాబాద్ మహానగర పరిధిలోని దాదాపు 350 ప్రాంతాలలో స్థానిక మార్కెట్ డిమాండ్‌ను బట్టి విడివిడిగా ధరలను ఖరారు చేయనున్నారు. జూబ్లీహిల్స్ లాంటి ఏరియాల్లో గజం విలువ రూ.80 వేల నుంచి రూ.90 వేలకు పెరిగే అవకాశం ఉంది. అపార్ట్‌మెంట్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌ల ఫ్లాట్ల చదరపు అడుగు ధరల్లో కూడా 75 శాతం వరకు మార్పులు రానున్నాయి. ప్రస్తుతం చదరపు అడుగు రూ.3500 నుండి రూ.4000 వరకు ఉన్న విలువల స్థానంలో రూ.6000 వరకు నిర్ధారించనున్నారు. అదేవిధంగా వాణిజ్య ప్రాంతాలలో బహిరంగ మార్కెట్ ధరలు రూ.8000 నుండి రూ.12000 వరకు ఉండటంతో ప్రభుత్వ ల్యాండ్ వాల్యూను రూ.6600గా ఫిక్స్ చేయాలని అధికారులు భావిస్తున్నారు. వంద అడుగుల రోడ్లు, ప్రధాన లింక్ రోడ్లు ఉన్న ఏరియాల్లో స్థానిక వృద్ధిని బట్టి రేట్లు పెరగనున్నాయి. ప్రస్తుతం స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా ఏడాదికి రూ.15 వేల కోట్ల ఆదాయం లభిస్తుండగా.. ఈ తాజా సవరణల ద్వారా ప్రభుత్వ ఖజానాకు అదనంగా మరో రూ.1500 కోట్ల రాబడి చేకూరనుంది. గతంలో 2021, 2022 సంవత్సరాల్లో చివరిసారిగా ఈ విలువల సవరణ జరిగింది. ఆ తర్వాత ఐటీ రంగ విస్తరణ, మౌలిక వసతుల మెరుగుదల వల్ల హైదరాబాద్ చుట్టుపక్కల విల్లాలు హైరైజ్ బిల్డింగుల నిర్మాణాలు పెరిగి భూముల ధరలు ఆకాశాన్నంటాయి. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కాగా ఈ కొత్త ధరల అమలు ప్రక్రియను ప్రారంభించిన ఆరు నెలల తర్వాత మార్కెట్ సరళిని బట్టి అధికారులు మరోసారి సమీక్ష నిర్వహించనున్నారు. ఎకరం భూమి కనీసం పదిహేను లక్షలు పెరిగే అవకాశం ఉందని చెప్పారు. అవుటర్ రింగ్ రోడ్డు, ఇన్నర్ రింగ్ రోడ్డు పరిధి ప్రామాణికంగా ధరలు పెంపు ఉంటుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన ఉంటుందని ఆయన చెప్పారు. అరవింద్ సుబ్రహ్మణ్యం నివేదిక ఆధారంగా గత ప్రభుత్వం రెండుసార్లు భూముల ధరలు పెంచిందన్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి 2022 నుంచి భూములు ధరలు పెంచలేదని గుర్తు చేశారు. భూముల ధరలు పెరుగుతాయని దానితో పాటు ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ పరంగా ఆదాయం కూడా లభిస్తుందని చెప్పారు. వరంగల్ మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులను వేగవంతం చేయనున్నామని చెప్పారు.

# కేంద్ర కేబినెట్ విస్తరణ...?

- మొదటి పేజీ తరువాయి

జరిగిన మొదటి పర్యాయపు చివరి విస్తరణలో పలువురు మంత్రులకు పదోన్నతి లభించింది. ఇక రెండవ పర్యాయంలో ప్రభుత్వం ఏర్పడిన దాదాపు రెండేళ్ల తర్వాత జూలై 2021లో మంత్రివర్గాన్ని తొలిసారిగా విస్తరించారు. మే 2023లో పోర్ట్‌ఫోలియోల పునర్వ్యవస్థీకరణ జరిగింది. ఇక మోడీ జూన్ 9, 2024న మూడవసారి ప్రమాణ స్వీకారం చేశారు. ఇప్పుడు రెండేళ్లు పూర్తికాబోతున్నాయి. ఫలితంగా మళ్లీ మంత్రివర్గ విస్తరణపై ఊహాగానాలు తీవ్రమయ్యాయి. ప్రస్తుతం మంత్రివర్గంలో 72 మంది సభ్యులు ఉండగా.. గరిష్టంగా 81 మంది మంత్రులను నియమించవచ్చు. కొంతమంది కొత్తవారికి అవకాశం ఇచ్చే అవకాశం ఉన్నప్పటికీ.. వారి పనితీరు ఆధారంగా కొంతమంది ప్రస్తుత మంత్రులను తొలగించాలనే చర్చ కూడా జరుగుతోంది. వచ్చే ఏడాది ఏడు రాష్ట్రాల్లో జరగనున్న ఎన్నికల దృష్ట్యా ప్రాంతీయ, కుల సమతుల్యత సాధించబడుతుందని భావిస్తున్నారు. ఒకవేళ విస్తరణ జరిగితే బీహార్ నుంచి ప్రాధాన్యత దక్కవచ్చని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇక బీజేపీ వర్గాల సమాచారం మేరకు.. పలువురు కొత్త ముఖాలను జాతీయ ప్రధాన కార్యదర్శులుగా నియమించే అవకాశం కూడా ఉంది. యువ అధ్యక్షుడు నితిన్ నబిన్‌తో సమన్వయం కొనసాగించేందుకు రాష్ట్రాల నుంచి జాతీయ స్థాయికి తీసుకువస్తారని తెలుస్తోంది.

# 44 ఏళ్ల వరకు ఉద్యోగాలకు అర్హత

- మొదటి పేజీ తరువాయి



నంబర్ 30ని విడుదల చేసింది. ఆ సమయంలో వయోపరిమితిని పదేళ్లకు అదనంగా మరో రెండేళ్లు పెంచి మొత్తం 46 ఏళ్లకు పెంచారు. అయితే ఈ జీవో గడువు 2026 ఫిబ్రవరితో ముగిసింది. దీంతో వయోపరిమితి మళ్లీ ప్రాథమిక స్థాయి అయిన 34 ఏళ్లకు పడిపోయింది. ఈ గ్యాప్‌ను భర్తీ చేయడానికి, కొత్త నోటిఫికేషన్లలో అభ్యర్థులకు అవకాశం కల్పించడానికి ప్రభుత్వం కొత్త జీవోను తీసుకొచ్చింది. జీవో నెంబర్ 86 ప్రకారం, ఈ పదేళ్ల వయోపరిమితి సడలింపు ఉత్తర్వులు జారీ చేసిన తేదీ నుంచి ఒక ఏడాదిపాటు మాత్రమే అమలులో ఉంటాయి. ఈ ఏడాది కాలంలో వివిధ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీలు విడుదల చేసే నోటిఫికేషన్లకు మాత్రమే ఈ సడలింపు వర్తిస్తుంది. ఈ సడలింపు అన్ని ప్రభుత్వం ఉద్యోగులకు వర్తించదు. ప్రభుత్వం స్పష్టంగా పేర్కొన్నట్టుగా, సివిల్ ఉద్యోగాలు, గ్రూప్స్, సెక్రటేరియట్ పోస్టులు ఇతర సాధారణ ప్రభుత్వ ఉద్యోగాలకు ఇది వర్తిస్తుంది. పోలీసు, ఎక్సైజ్, ఫైర్, జైళ్ల శాఖ వంటి యూనిఫామ్ సర్వీసులకు ఈ వయోపరిమితి పెంపు వర్తించదని ప్రభుత్వం క్లారిటీ ఇచ్చింది.

# మంత్రివర్గ ప్రక్షాళనకు రెడీ

- మొదటి పేజీ తరువాయి

పరంగా కొందరిని తప్పించాల్సిన పరిస్థితులున్నాయి. అలాగే పనితీరు ఆధారంగా మరికొందరిని బయటకు పంపాల్సిన అవసరం ఉంది. అలాగే 2028 ఎన్నికల్లో పార్టీకిమంచి ఊపు తెచ్చే వారిని ఎంపిక చేసుకుని ముందుకు వెళ్లాలన్న భావనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారు. ప్రధానమైన వారిని కొందరిని అలాగే ఉంచి జిల్లాల వారీగా కొందరిని మార్చి, కొత్త వారికి అవకాశాలను కల్పిస్తే అందరికీ అవకాశం దొరికినట్లవుతుందని, అప్పుడు అసంతృప్తి, అసహనాలు ఉండవన్న అంచనాలో రేవంత్ రెడ్డి ఉన్నారు. ఈ మేరకే ఢిల్లీకి వెళ్లినప్పుడల్లా హైకమాండ్ ఎదుట ఈ ప్రతిపాదన పెట్టినా అందుకు హైకమాండ్ సుముఖత వ్యక్తం చేయకపోవడంతో అందుకు సరైన సమయం కోసం వేచి చూస్తున్నారని తెలిసింది.

## కేంద్ర మంత్రి పదవికి
# ఈటల రాజేందర్ పేరు..?

- మొదటి పేజీ తరువాయి

మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకోనున్న నేపథ్యంలో కేంద్ర మంత్రివర్గంలో భారీ పునర్వ్యవస్థీకరణ జరిగే అవకాశమున్నట్లు ఢిల్లీ భారతీయ జనతా పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇదే సమయంలో రాష్ట్రాల వారీగా రాజకీయ సమీకరణాలు, సామాజిక వర్గాల ప్రాతినిధ్యం, రాబోయే ఎన్నికల వ్యూహాలను దృష్టిలో పెట్టుకుని కొన్ని కీలక మార్పులు ఉండొచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో తెలంగాణకు చెందిన పలువురు నాయకుల పేర్లు చర్చకు వస్తుండగా, ముఖ్యంగా మల్కాజ్గిరి ఎంపీ, తెలంగాణ ఉద్యమకారుడిగా గుర్తింపు పొందిన ఈటల రాజేందర్ పేరు ప్రముఖంగా వినిపిస్తున్నట్లు సమాచారం. ఆయనకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి పదవి అప్పగించే అవకాశాలపై ఢిల్లీ రాజకీయ, భారతీయ జనతా పార్టీ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతున్నట్లు సమాచారం. తెలంగాణలో బీసీ సామాజిక వర్గ సమీకరణాలు, పార్టీ విస్తరణ, రాబోయే ఎన్నికల వ్యూహాలు, రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా అధిష్టానం ఆలోచిస్తున్న నేపథ్యంలో ఈటల రాజేందర్కు కీలక బాధ్యతలు అప్పగించే అవకాశాలపై ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మరోవైపు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పదవిపై కూడా రాజకీయ చర్చ మొదలైంది. భగీరథ్ పోక్సో కేసు నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ విమర్శలు, ప్రతిపక్ష పార్టీల నిరసనలు, సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న చర్చలతో బండి సంజయ్పై ఒత్తిడి పెరిగినట్లు రాజకీయ వర్గాలు .అభిప్రాయపడుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రివర్గంలో తెలంగాణకు సంబంధించి మార్పులు జరిగే అవకాశాలపై ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి.

# రేషన్ కార్డు కోసం వచ్చిన ఉద్యోగి

**హైదరాబాద్, మే 19:** హైదరాబాద్ పంజాగుట్ట పరిధిలో ఒక ప్రభుత్వ ఉద్యోగిని వలలో వేసుకుని హనీట్రాప్ ద్వారా సుమారు రూ.6 లక్షలు వసూలు చేసిన కిలాడీ లేడీని పోలీసులు అరెస్ట్ చేశారు. రేషన్ కార్డు కోసం ఖైరతాబాద్ సివిల్ సప్లై ఆఫీసుకు వెళ్లిన సదరు మహిళ.. అక్కడ పనిచేసే ఎల్డీసీ ఉద్యోగితో పరిచయం పెంచుకుంది. ఆ తర్వాత ఓయో రూమ్ రసీదులు, ఫోటోలతో బ్లాక్‌మెయిలింగ్‌కు దిగింది. బాధితుడి తల్లి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పంజాగుట్ట పోలీసులు నిందితురాలిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. హైదరాబాద్ పంజాగుట్ట పరిధిలో రేషన్ కార్డు కోసం వచ్చిన ఒక మహిళ.. ప్రభుత్వ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగిని హనీట్రాప్ వేసి లక్షలాది రూపాయలు వసూలు చేసింది. ఖైరతాబాద్ సివిల్ సప్లయ్ ఆఫీసు వేదికగా సాగిన ఈ బ్లాక్‌మెయిలింగ్ వ్యవహారం బాధితుడి తల్లి ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చింది. పంజాగుట్ట పోలీస్ ఇన్‌స్పెక్టర్ వెల్లడించిన వివరాల ప్రకారం.. రహమత్ నగర్ ప్రాంతానికి చెందిన మహిళ (40) తన భర్తతో విడాకులు తీసుకుని ఒంటరిగా ఉంటోంది. ఈ క్రమంలోనే 2022 జూన్ నెలలో కొత్త రేషన్ కార్డు కోసం ఆమె ఖైరతాబాద్‌లోని సివిల్ సప్లయ్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంది. కార్డు మంజూరు ప్రక్రియ కోసం తరచూ ఆఫీసు చుట్టూ తిరుగుతున్న క్రమంలో అక్కడ లోయర్ డివిజన్ క్లర్క్‌గా విధులు నిర్వహిస్తున్న ఓ ప్రభుత్వ ఉద్యోగితో ఆమెకు పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం కాస్తా అక్రమ సంబంధానికి దారి తీసింది. వీరిద్దరి వ్యవహారం కాస్తా ముదరడంతో తరచూ ఓయో రూమ్‌లకు వెళ్లడం, అలాగే సదరు ప్రభుత్వ ఉద్యోగి ఆమె నివాసానికి రావడం వంటివి సాగాయి. అయితే ఇదంతా తనను లూటీ చేయడానికి మహిళ పన్నిన వ్యూహంలో భాగమేనని బాధితుడు ఊహించలేకపోయాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆమె సదరు ఉద్యోగి నుంచి విడతల వారీగా డబ్బులు డిమాండ్ చేయటం ప్రారంభించింది. మొదట్లో చిన్న మొత్తంలో రూ.5 వేలతో మొదలైన డిమాండ్లు.. ఆ తర్వాత లక్షల్లోకి చేరాయి. ఒకానొక దశలో బాధితుడిపై మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేసింది. తమ ఇద్దరి వ్యక్తిగత ఫోటోలను, వారు కలిసి వెళ్లిన ఓయో రూమ్ రసీదులను పోలీసులకు, ఉన్నతాధికారులకు చూపిస్తానంటూ ఆమె నిరంతరం బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడింది. అవమాన భారంతో సదరు ఉద్యోగి ఆమె అడిగినప్పుడల్లా డబ్బులు ఇచ్చుకుంటూ రాగా.. ఇప్పటి వరకు దాదాపు రూ.6 లక్షల వరకు కిలాడీ లేడి స్వాహా చేసింది. ఇటీవల కాలంలో ప్రవర్తనలో మార్పు రావడం, ఆఫీస్ విషయాల్లో తీవ్ర ఆందోళన చెందడం, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుండటాన్ని అతని తల్లి గమనించారు. కొడుకును గట్టిగా నిలదీయడంతో లేడీ చేతిలో తను చిక్కుకుని బ్లాక్‌మెయిలింగ్‌కు గురవుతున్న దారుణమైన నిజాన్ని తల్లికి వివరించాడు.

# ఇలా అయితే అనారోగ్యం వచ్చినట్టే




వేసవి కాలం వచ్చిందంటే చాలు అందరికీ ముందుగా గుర్తొచ్చేది పండ్ల రాజు మామిడి పండు. ఆ రుచికి, సువాసనకు ఎవరైనా ఫిదా అవ్వాల్సిందే. అయితే మామిడి పండ్లను ఆస్వాదించే క్రమంలో మనం చేసే కొన్ని చిన్న చిన్న పొరపాట్లు మన ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. చాలామంది మామిడి పండు తిన్న వెంటనే దాహంగా అనిపించి నీళ్లు తాగుతుంటారు. ఇది చూడటానికి సాధారణ విషయంగా అనిపించినప్పటికీ, శరీరంలోని జీర్ణవ్యవస్థను ఇది తీవ్రంగా ఇబ్బంది పెడుతుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. కేవలం రుచి కోసం పండును ఆస్వాదించడమే కాదు, దానిని ఎలా తినాలో కూడా తెలుసుకోవడం ఎంతో ముఖ్యం. మామిడి పండ్లలో చక్కెర శాతం, పీచు పదార్థం అంటే ఫైబర్ ఎక్కువగా ఉంటాయి. ఇవి మన శరీరంలో జీర్ణం కావడానికి కొంత సమయం పడుతుంది. మనం పండు తిన్న వెంటనే నీళ్లు తాగడం వల్ల పొట్టలోని జీర్ణరసాలు పలుచబడిపోతాయి. దీనివల్ల మామిడి పండులోని పోషకాలను శరీరం గ్రహించే వేగం మందగిస్తుంది. ఫలితంగా జీర్ణ ప్రక్రియ ఆలస్యమై ఆహారం పొట్టలో అలాగే ఉండిపోయి గ్యాస్ లేదా అసౌకర్యానికి దారితీస్తుంది. అందుకే మామిడి పండు తిన్న తర్వాత కనీసం అరగంట పాటు నీటిని ముట్టుకోకపోవడమే శ్రేయస్కరం. మామిడి పండు తిన్న వెంటనే నీళ్లు తాగడం వల్ల కలిగే ప్రధాన ఇబ్బందుల్లో కడుపు నొప్పి ఇంకా విరేచనాలు ముఖ్యమైనవి. నీరు జీర్ణ ఎంజైమ్‌ల పనితీరును అడ్డుకోవడం వల్ల ఆహారం సరిగ్గా జీర్ణం కాక పొట్టలో గందరగోళం మొదలవుతుంది. ఇది వికారం లేదా కడుపులో ఉబ్బరం వంటి సమస్యలకు దారితీస్తుంది. ముఖ్యంగా సున్నితమైన జీర్ణవ్యవస్థ ఉన్నవారిలో ఈ ప్రభావం మరింత ఎక్కువగా ఉంటుంది. మామిడి పండులోని ఫ్రక్టోజ్ (సహజ చక్కెర) నీటితో కలిసినప్పుడు బ్యాక్టీరియా చర్య వేగవంతమై ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం కూడా ఉంది. ఆరోగ్యంగా ఉండాలంటే మామిడి పండు తిన్న తర్వాత కనీసం ముప్పై నుండి నలభై నిమిషాల వరకు వేచి ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ సమయంలో జీర్ణక్రియ సక్రమంగా జరిగి పండులోని విటమిన్లు ఇంకా ఖనిజాలు రక్తంలో కలుస్తాయి. ఆ తర్వాత నీళ్లు తాగడం వల్ల ఎటువంటి ఇబ్బంది ఉండదు. అలాగే మామిడి పండ్లను రాత్రి పూట కంటే ఉదయం లేదా మధ్యాహ్నం సమయంలో తీసుకోవడం వల్ల అవి మెరుగ్గా జీర్ణమవుతాయి. పండు తినే ముందు దానిని గంట పాటు నీటిలో నానబెట్టడం వల్ల అందులోని వేడి తగ్గి చర్మానికి ఎటువంటి అలర్జీలు రాకుండా ఉంటాయి. ప్రకృతి ప్రసాదించిన ఈ అద్భుతమైన పండును ఆస్వాదించేటప్పుడు ఈ చిన్న జాగ్రత్తలు పాటించడం వల్ల మనం ఆరోగ్యంగా ఉండవచ్చు. ఆహారపు అలవాట్లలో క్రమశిక్షణే మనల్ని దీర్ఘకాలిక రోగాల నుండి కాపాడుతుంది. మామిడి పండు తిన్న వెంటనే నీళ్లు తాగే అలవాటు మీకు ఉంటే వెంటనే దానిని మార్చుకోండి. రుచితో పాటు ఆరోగ్యం కూడా ముఖ్యం కాబట్టి నియమాలను పాటిస్తూ ఈ వేసవిని ఆనందంగా గడపండి. మన శరీరానికి ఏది అవసరమో.. ఎప్పుడు అవసరమో గుర్తించి మెలగడమే అసలైన విజ్ఞత.

# వెయిట్‌లాస్‌కు మ్యాజిక్ ఫార్ములా?



అతిగా వ్యాయామం చేయకుండానే బరువును అదుపులో ఉంచుకునే అద్భుత ఫార్ములా '30-30-30'. ఉదయం నిద్రలేచిన అరగంటలో ప్రోటీన్ తీసుకోవడం, ఆపై 30 నిమిషాల వ్యాయామంతో జీవక్రియను వేగవంతం చేసే ఈ సింపుల్ టెక్నిక్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. నేటి ఆధునిక జీవనశైలిలో అధిక బరువు అనేది చాలా మందిని వేధిస్తున్న ప్రధాన సమస్య. బరువు తగ్గాలనే ఆత్రుతతో చాలా మంది క్రాష్ డైట్లు పాటించడం, అతిగా వ్యాయామాలు చేయడం లేదా సర్జరీల వైపు మొగ్గు చూపడం వంటివి చేస్తుంటారు. అయితే ఇటువంటి పద్ధతులు శరీరానికి మేలు చేయడం కంటే అనారోగ్య సమస్యలనే ఎక్కువగా తెచ్చిపెడతాయి. బరువు తగ్గడం అనేది ఒక నిరంతర ప్రక్రియ అని గుర్తించాలి. దీని కోసం ఎటువంటి ఇబ్బంది లేకుండా, ఆరోగ్యకరమైన పద్ధతిలో పనిచేసే '30-30-30' రూల్ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందుతోంది. ఈ పద్ధతి ప్రధానంగా మూడు అంశాల చుట్టూ తిరుగుతుంది. ఇది సరళంగా ఉన్నప్పటికీ జీవక్రియపై అద్భుతమైన ప్రభావం చూపుతుంది. ఈ నియమం ప్రకారం.. ఉదయం నిద్రలేచిన 30 నిమిషాల లోపు 30 గ్రాముల ప్రోటీన్ తీసుకోవాలి. ఆ తర్వాత 30 నిమిషాల పాటు తక్కువ తీవ్రత కలిగిన వ్యాయామాలు చేయాలి. చివరగా మనం తీసుకునే ఆహారంలో 30 శాతం క్యాలరీలు తగ్గించాలి. ఈ పద్ధతి కేవలం కొవ్వును కరిగించడమే కాకుండా రోజంతా ఆకలిని నియంత్రించడంలో అద్భుతంగా సాయపడుతుంది. శరీరాన్ని హింసించకుండానే క్రమపద్ధతిలో బరువు తగ్గడానికి ఇది ఒక గొప్ప మార్గం. ఉదయం నిద్రలేచిన వెంటనే 30 గ్రాముల ప్రోటీన్ తీసుకోవడం వల్ల శరీర జీవక్రియ వేగవంతం అవుతుంది. పాలు, కోడిగుడ్లు, పప్పుధాన్యాలు, మొలకలు లేదా మాంసాహారం వంటి వాటిని అల్పాహారంలో భాగం చేసుకోవాలి. ప్రోటీన్లు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకుంటే కడుపు నిండుగా అనిపించి ఎక్కువ సమయం ఆకలి వేయదు. దీనివల్ల మధ్యలో అనవసరమైన స్నాక్స్ తినాలనే కోరిక తగ్గుతుంది. అల్పాహారం తీసుకున్న తర్వాత 30 నిమిషాల పాటు నడక, జాగింగ్ లేదా ఈత వంటి తక్కువ తీవ్రత కలిగిన వ్యాయామాలు చేయాలి. దీనివల్ల శరీరంలో పేరుకుపోయిన అదనపు కొవ్వు కరగడం మొదలవుతుంది. కండరాలు బలంగా తయారై శరీరం దృఢంగా మారుతుంది. బరువు తగ్గడంలో క్యాలరీల పాత్ర చాలా కీలకం. మనం ఖర్చు చేసే శక్తి కంటే ఎక్కువ క్యాలరీలు తీసుకోవడం వల్ల అవి శరీరంలో కొవ్వుగా మారిపోతాయి. అందుకే రోజువారీ క్యాలరీల ఆహారంలో 30 శాతం తగ్గించి తీసుకోవాలి. దీనివల్ల శరీరం తన అవసరాల కోసం పేరుకుపోయిన పాత కొవ్వును ఇంధనంగా వాడుకుంటుంది. ఈ రూల్ పాటించడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు స్థిరంగా ఉంటాయి. ఇది డయాబెటిస్ ముప్పును కూడా తగ్గిస్తుంది. ఎటువంటి ఒత్తిడి లేకుండా స్థిరంగా బరువు తగ్గాలనుకునే వారికి ఈ విధానం ఒక సంజీవనిలా పనిచేస్తుంది. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, క్రమం తప్పని వ్యాయామం కలిస్తేనే ఆశించిన ఫలితాలు వస్తాయి. ఈ 30-30-30 రూల్ మనల్ని క్రమశిక్షణతో ఉంచడమే కాకుండా ఆరోగ్యకరమైన జీవనశైలికి పునాది వేస్తుంది. కఠినమైన డైట్లు లేకపోయినా ఫలితం నెమ్మదిగా మొదలై దీర్ఘకాలంలో స్థిరంగా ఉంటుంది. బరువు తగ్గడమే లక్ష్యంగా పెట్టుకున్న వారు ఈ చిన్న మార్పును తమ దినచర్యలో భాగం చేసుకోవడం వల్ల అద్భుతమైన మార్పును చూడవచ్చు. ఆరోగ్యమే మహాభాగ్యం అని గుర్తించి సరైన పద్ధతిలో అడుగులు వేయండి. మన శరీరాన్ని మనం గౌరవిస్తూ సంరక్షించుకోవడం కంటే మించిన సంతోషం మరొకటి ఉండదు.


# రాత్రి భోజనంలో ఏది తీసుకుంటే ఆరోగ్యానికి మేలు చేస్తుంది?



నేటి కాలంలో ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించడం చాలా ముఖ్యం. తరచుగా మనం చేసే కొన్ని పొరపాట్లు కారణంగా లేనిపోని చిక్కుల్లో పడుతుంటాం. అవి కొన్ని ఆరోగ్య సమస్యలకు దారితీయవచ్చు. ముఖ్యగా రాత్రివేళల్లో భోజనంలో అన్నం, చపాతీలలో ఏది తీసుకుంటే ఆరోగ్యానికి ఎక్కువ మేలు చేస్తుందో చాలా మందికి సరైన అవగాహన ఉండదు. నేటి కాలంలో ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించడం చాలా ముఖ్యం. తరచుగా మనం చేసే కొన్ని పొరపాట్లు కారణంగా లేనిపోని చిక్కుల్లో పడుతుంటాం. అవి కొన్ని ఆరోగ్య సమస్యలకు దారితీయవచ్చు. ముఖ్యగా రాత్రివేళల్లో భోజనంలో అన్నం, చపాతీలలో ఏది తీసుకుంటే ఆరోగ్యానికి ఎక్కువ మేలు చేస్తుందో చాలా మందికి సరైన అవగాహన ఉండదు. చాలా కుటుంబాల్లో చపాతీ, అన్నం లేకుండా భోజనం సంపూర్ణం కాదు. చపాతీ, అన్నం తినేంత వరకు అది భోజనంలా అనిపించదు. కొందరు చపాతీని ఆరోగ్యకరమైనదిగా భావిస్తే, మరికొందరు అన్నం తేలికైనదని, సులభంగా జీర్ణమవుతుందని అనుకుంటారు. ఈ రెండు ఆహారాలలో ఏది సులభంగా జీర్ణమవుతుంది? దేనికి ఎక్కువ సమయం పడుతుంది అనే ప్రశ్న చాలా మందిలో తలెత్తుతుంది. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం అన్నం జీర్ణం కావడానికి తక్కువ సమయం పడుతుంది. కానీ చపాతీ తినడం కూడా మంచిదే. నిపుణుల అభిప్రాయం ప్రకారం అన్నం జీర్ణం కావడానికి సాధారణంగా 1 నుండి 2 గంటల సమయం పడుతుంది. అన్నంలో అధిక మొత్తంలో పీచుపదార్థం ఉంటుంది. ఇది జీర్ణక్రియకు సహాయపడుతుంది. అన్నం శరీరంలోకి ప్రవేశించినప్పుడు త్వరగా గ్లూకోజ్‌గా మారుతుంది. అందుకే అనారోగ్యంతో లేదా బలహీనంగా ఉన్నవారికి తరచుగా అన్నం తినమని సలహా ఇస్తారు. ఇది కడుపును తేలికగా ఉంచి, తక్షణ శక్తిని అందిస్తుంది. తెల్ల బియ్యం కంటే బ్రౌన్ రైస్‌లో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది జీర్ణం కావడానికి కొంత సమయం పడుతుంది. జీర్ణక్రియకు తెల్ల బియ్యం కంటే బ్రౌన్ రైస్ మంచిది. మరింత ప్రయోజనకరమైనది. కాబట్టి రాత్రి పూట చపాతీ బదులు బ్రౌన్ రైస్ తినడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చు. చపాతీ పగటి వేళల్లో తీసుకుంటే మంచిది.

# పండుతోపాటు గింజలను కూడా తినేస్తున్నారా?

వేసవి కాలం రాగానే అందరికీ ముందుగా గుర్తొచ్చే పండు పుచ్చకాయ. శరీరానికి కావాల్సిన నీటిని అందిస్తూ, ఉష్ణతాపం నుండి ఉపశమనం కలిగించే ఈ రసవంతమైన పండును సామాన్యుల నుండి సెలబ్రిటీల వరకు ప్రతి ఒక్కరూ ఇష్టపడతారు. అయితే వేసవిలో పుచ్చకాయ తింటున్నప్పుడు గింజలను పారేస్తున్నారా? అయితే మీరు ఒక గొప్ప పోషకాహారాన్ని వృథా చేస్తున్నట్లే. పుచ్చకాయ తినేటప్పుడు చాలామంది గింజలను వేరు చేసి పారేస్తుంటారు. పోషకాల నిధి.. డైటీషియన్ రంజనా సింగ్ ప్రకారం, పుచ్చకాయ గింజల్లో ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు, మెగ్నీషియం, ఐరన్ జింక్ వంటి ముఖ్యమైన పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరానికి తక్షణ శక్తిని అందించడమే కాకుండా, కండరాల బలోపేతానికి రోగనిరోధక శక్తిని పెంచడానికి ఎంతో తోడ్పడతాయి. అయితే ఈ పోషకాలను శరీరం సరిగ్గా గ్రహించాలంటే గింజలను నమిలి తినడం చాలా ముఖ్యం. గింజలను నమలకుండా నేరుగా మింగేయడం వల్ల వాటిలోని పూర్తి ప్రయోజనాలను మనం పొందలేము. అంతేకాకుండా, వీటిలో ఉండే ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరిచి మలబద్ధకం వంటి సమస్యలను దూరం చేస్తుంది. ఎలా తీసుకోవాలి? నిపుణుల సూచనలు పుచ్చకాయ గింజలను నేరుగా పండుతో పాటు నమిలి తినవచ్చు లేదా వాటిని సేకరించి ఎండబెట్టి, దోరగా వేయించుకుని చిరుతిండిగా కూడా తీసుకోవచ్చు. వేయించిన గింజలు రుచిగా ఉండటమే కాకుండా సులభంగా జీర్ణమవుతాయి. అయితే ఏ వస్తువైనా మితంగా తీసుకుంటేనే ఆరోగ్యం. పుచ్చకాయ గింజలను కూడా మోతాదుకు మించి తీసుకోకూడదు. సాధారణ ఆరోగ్యవంతులకు ఇవి ఎంతో మేలు చేసినప్పటికీ, వీటిని తీసుకునేటప్పుడు కొన్ని జాగ్రత్తలు పాటించడం అవసరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎవరు జాగ్రత్తగా ఉండాలి? పుచ్చకాయ గింజలు సురక్షితమైనవే అయినప్పటికీ, జీర్ణ సంబంధిత సమస్యలు అంటే గ్యాస్, ఎసిడిటీ లేదా అజీర్తితో బాధపడేవారు వీటిని అధికంగా తీసుకోకూడదు. గింజలు కడుపులో భారంగా అనిపించేలా చేసే అవకాశం ఉంది. చిన్న పిల్లలు వృద్ధులు వీటిని నమలకుండా మింగడం వల్ల జీర్ణ సమస్యలు తలెత్తవచ్చు. అలాగే కిడ్నీలో రాళ్లు లేదా మినరల్స్ అసమతుల్యత ఉన్నవారు తమ ఆహారంలో వీటిని చేర్చుకునే ముందు ఖచ్చితంగా వైద్యుడిని సంప్రదించాలి. ఈ చిన్న జాగ్రత్తలు పాటిస్తూ పుచ్చకాయ గింజలను మీ ఆహారంలో భాగం చేసుకుంటే, వేసవిలో ఆరోగ్యంగా ఉండటమే కాకుండా శరీరానికి అవసరమైన ఖనిజాలను సహజంగానే పొందవచ్చు.





# ‘పెద్ది’ ట్రైలర్‌కు కౌంట్‌డౌన్ ప్రారంభం.. స్పెషల్ అప్‌డేట్ ఇచ్చిన రామ్ చరణ్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, యంగ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం పెద్దిపై అంచనాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. దర్శకుడు బుచ్చిబాబు సన తెరకెక్కిస్తున్న ఈ స్పోర్ట్స్ డ్రామా చిత్రం ఇప్పటికే ప్రేక్షకుల్లో ప్రత్యేక ఆసక్తిని సృష్టించింది. విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్, పాటలు సినిమాపై భారీ హైప్ తీసుకొచ్చాయి. ఇప్పుడు అభిమానులు అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న అంశం పెద్ది ట్రైలర్. ఈ ట్రైలర్ విడుదల కోసం సినీ అభిమానులు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్న సమయంలో చిత్రబృందం మరో భారీ అప్డేట్ ఇచ్చింది. ఇప్పటికే ముంబైలో ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించనున్నట్లు ప్రకటించిన మేకర్స్, తాజాగా ఈ ఈవెంట్‌కు సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా రామ్ చరణ్ స్వయంగా ఓ ప్రత్యేక గ్లింప్స్ ద్వారా అభిమానుల్లో మరింత ఉత్సాహం నింపారు. “ఇప్పటివరకు మీరు పాటలు, గ్లింప్స్ చూశారు.. ఇక ఇప్పుడు అసలు బ్లాస్ట్ చూడబోతున్నారు” అంటూ అభిమానుల్లో ఆసక్తిని పెంచేలా రామ్ చరణ్ సందేశం ఇచ్చారు. ఈ మాటలతో సోషల్ మీడియాలో పెద్ది ట్రైలర్‌పై చర్చలు మరింత పెరిగిపోయాయి. ముంబైలోని జియో వరల్డ్ డ్రైవ్ వేదికగా ఈ గ్రాండ్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ జరగనుంది. మధ్యాహ్నం 3 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభం కానున్నట్లు సమాచారం. భారీ స్థాయిలో అభిమానులు, సినీ ప్రముఖులు పాల్గొనే అవకాశమున్న ఈ ఈవెంట్‌పై ఇప్పుడు ప్రత్యేక ఆసక్తి నెలకొంది. స్పోర్ట్స్ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో రామ్ చరణ్ పాత్ర చాలా పవర్‌ఫుల్‌గా ఉండబోతుందని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్‌లో గ్రామీణ నేపథ్యంలో కనిపించిన చరణ్ లుక్ అభిమానులను ఆకట్టుకుంది. ఇక ఈ చిత్రానికి ఆస్కార్ విజేత సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ఆయన అందించిన పాటలకు ఇప్పటికే మంచి స్పందన లభించింది. అలాగే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కూడా సినిమాకు ప్రత్యేక బలంగా నిలుస్తుందని చిత్రబృందం భావిస్తోంది. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రాన్ని వృద్ధి సినిమాస్ నిర్మిస్తోంది. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న పెద్ది జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ట్రైలర్ విడుదలతో సినిమా అంచనాలు మరింత పెరుగుతాయా? అభిమానులు ఆశిస్తున్న స్థాయిలో ఈ ట్రైలర్ ఉండబోతుందా? అన్న ఆసక్తి ఇప్పుడు అందరిలో కనిపిస్తోంది.

# తెలుగు క్రికెటర్‌తో శ్రీలీల డేటింగ్..!

కన్నడ ముద్దుగుమ్మ, హీరోయిన్ శ్రీలీల గురించి టాలీవుడ్ ప్రేక్షకులకు చెప్పాల్సిన పనిలేదు. ఈ ముద్దుగుమ్మ స్టార్ హీరోల సరసన మెప్పించింది. ఈ ఏడాది పరాశక్తి చిత్రంతో తమిళ సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టిన ఈ కన్నడభామ ప్రస్తుతం ధనుష్‌కు జంటగా కనిపించనున్నారు. తెలుగులో స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకుంది. ఇక సినిమాల సంగతి పక్కనపెడితే.. ఈ ముద్దుగుమ్మపై గతంలో రూమర్స్ వినిపించాయి. బాలీవుడ్ హీరో కార్తీక్ ఆర్యన్‌తో డేటింగ్‌లో ఉందంటూ వార్తలొచ్చాయి. వినాయక చవితి వేడుకల కోసం ఆమె తన తల్లితో కలిసి ముంబయిలోని కార్తీక్ ఇంటికి వెళ్లడంతో పుకార్లు వైరలయ్యాయి. అదే సమయంలో తనకు డాక్టర్ కోడలు కావాలని కార్తీక్ ఆర్యన్ తల్లి చెప్పడంతో మరింత ఆజ్యం పోసింది. కానీ వీటిపై ఎవరూ కూడా క్లారిటీ ఇవ్వలేదు.


తాజాగా శ్రీలీలపై మరోసారి డేటింగ్ రూమర్స్ సోషల్ మీడియాలో గుప్పుమంటున్నాయి. ఈ సారి ఏకంగా టీమిండియా క్రికెటర్‌తో శ్రీలీల డేటింగ్‌లో ఉందంటూ కథనాలొస్తున్నాయి. మన తెలుగువాడు, యంగ్ క్రికెటర్‌తో డేటింగ్ చేస్తోందని కథనాలు మొదలయ్యాయి.

ఏడాదిగా రూమర్స్..

శ్రీలీల, తిలక్ వర్మ ప్రేమలో ఉన్నారని గతేడాది నుంచి సోషల్ మీడియాలో పెద్దఎత్తున ప్రచారం జరుగుతోంది. ఇటీవల వీరిద్దరూ కలిసి కనిపించారని వార్తలు రావడంతో రూమర్స్‌కు మరింత బలం చేకూరుతోంది. దాదాపు ఆరు నెలల క్రితమే శ్రీలీల తన తల్లితో కలిసి తిరుమలను సందర్శించింది. అదే సమయంలో తిలక్ వర్మ కూడా అక్కడే ఉన్నట్లు సమాచారం. ఆ తర్వాత ధర్మశాలలో పంజాబ్ కింగ్స్, ముంబయి ఇండియన్స్ మధ్య జరిగిన ఐపీఎల్ మ్యాచ్ సందర్భంగా శ్రీలీల, ఆమె తల్లితో పాటు ముంబయి ఇండియన్స్ ఆటగాళ్లతో కలిసి కనిపించడంతో రూమర్స్ మరింత బలపడుతున్నాయి. అయితే తమపై వస్తున్న వార్తలపై ఇప్పటి వరకు ఎవరు కూడా స్పందించలేదు.



# ‘త్రికాల’గా వస్తున్న శ్రద్ధాదాస్.. రిలీజ్ డేట్ ఫిక్స్!



భారతీయ సనాతన ధర్మంలో దాగి ఉన్న రహస్యాలను ఆధారంగా చేసుకుని రూపొందిన మైథలాజికల్ ఫిక్షనల్ థ్రిల్లర్ ‘త్రికాల’ మే 29న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. హీరోయిన్ శ్రద్ధదాస్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రంలో మాస్టర్ ఫేమ్ మహేంద్రన్, అజయ్, సీనియర్ నటి ఆమని కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రానికి మణి తెల్లగూటి కథ, దర్శకత్వం వహించగా, రాధిక--శ్రీనివాస్ నిర్మించారు. చాగంటి ప్రొడక్షన్ ఎల్‌ఎల్‌బి ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయబోతుంది. ఇటీవలి కాలంలో మైథలాజికల్ టచ్‌తో వచ్చిన థ్రిల్లర్ చిత్రాలకు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తుండటంతో ‘త్రికాల’పై కూడా ఇండస్ట్రీలో ఆసక్తికర చర్చ మొదలైంది. ఆధునిక సాంకేతికతతో రూపొందించిన హైక్వాలిటీ వీఎఫ్ఎక్స్ ఈ సినిమాకు ప్రధాన బలం కానుందని చిత్రబృందం చెబుతోంది. ఇప్పటికే విడుదలైన ట్రైలర్, ప్రచార చిత్రాలు, పాటలకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ముఖ్యంగా మాస్టర్ మహేంద్రన్ యాక్షన్ సీక్వెన్స్‌లు, అజయ్ పవర్‌ఫుల్ పాత్ర, శ్రద్ధాదాస్ కొత్త లుక్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచాయి. ఈ సందర్భంగా దర్శకుడు మణి తెల్లగూటి మాట్లాడుతూ...“ప్రపంచంపై చీకటి కమ్ముకున్న సమయంలో వెలుగుగా అవతరించే శక్తి చుట్టూ ‘త్రికాల’ కథ తిరుగుతుంది. భారతీయ సనాతన ధర్మంలో దాగి ఉన్న కొన్ని ఆధ్యాత్మిక రహస్యాలను థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో మిళితం చేసి తెరకెక్కించాం. ఇప్పటికే విడుదలైన ట్రైలర్, పాటలకు అద్భుతమైన స్పందన వచ్చింది. ప్రేక్షకులకు ‘త్రికాల’ ఒక కొత్త అనుభూతిని అందిస్తుందనే నమ్మకం ఉంది” అని తెలిపారు. నిర్మాతలు మాట్లాడుతూ... సరికొత్త కాన్సెప్ట్‌తో, మైథలాజికల్ టచ్‌తో రూపొందిన ‘త్రికాల’ ప్రతి వర్గం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. సంస్కృతి, ఆధ్యాత్మికత, ఆసక్తి.. వంటి అంశాలు కలిసిన ఈ కథ ప్రేక్షకులకు కొత్త ఫీలింగ్ ఇస్తుంది’ అని పేర్కొన్నారు.ఈ సినిమాకు హర్షవర్ధన్ రమేశ్వర్ సంగీతం అందిస్తున్నారు.

# రజినీకాంత్ జైలర్ 2లో గెస్ట్ రోల్స్‌లో ఎవరెవరు కనిపించబోతున్నారంటే..?


సూపర్ స్టార్ రజినీకాంత్ క్రేజీ లైనప్‌లో ఒకటి జైలర్ సీక్వెల్ జైలర్ 2 కోలీవుడ్ డైరెక్టర్ నెల్సన్ దిలీప్‌కుమార్ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీలో తలైవా టైటిల్ రోల్‌లో నటిస్తున్నాడని తెలిసిందే. సీక్వెల్‌కు సంబంధించిన ఆసక్తికర వార్త ఇప్పుడు మూవీ లవర్స్‌ను ఖుషీ చేస్తోంది. జైలర్ 2లో ముత్తువేల్ పాండ్యన్ (తలైవా పాత్ర పేరు) మరింత పవర్ ఫుల్ రోల్‌లో చూపించబోతున్నాడట. నెల్సన్ దిలీప్ కుమార్ మైండ్ బ్లోయింగ్ స్క్రీన్ ప్లే ఐడియా ప్రేక్షకులను సర్‌ప్రైజ్ చేయనుందని ఇన్‌సైడ్ టాక్. ఫస్ట్ పార్ట్ ముత్తువేల్ పాండ్యన్ పదవీ విరమణకు ముందు జీవితాన్ని చూపించే ప్రీక్వెల్‌గా ఉండనుండగా.. సెకండాఫ్ పూర్తి స్థాయి సీక్వెల్‌గా రానుందట. జైలర్ 2లో పాపులర్ డైరెక్టర్ కమ్ యాక్టర్ ఎస్ జే సూర్య విలన్‌గా కనిపించబోతున్నాడని సమాచారం. గెస్ట్ అప్పీరియన్స్ రోల్స్‌లో మోహన్ లాల్, విజయ్ సేతుపతి, శివరాజ్ కుమార్ కనిపించనున్నారని టాక్. ఫస్ట్ పార్టులో విలన్‌గా కనిపించి బాక్సాఫీస్‌ను షేక్ చేసిన వినాయకన్ ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్‌లో కనిపించనున్నాడట. ఇక అనిరుధ్ రవిచందర్ అదిరిపోయే మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్‌తో మాస్ ఫీస్ట్‌లా జైలర్ 2 ఉండబోతుందన్న వార్తలు ఇప్పుడు అభిమానులు, మూవీ లవర్స్‌లో జోష్ నింపుతున్నాయి. తాజా టాక్ ప్రకారం సెప్టెంబర్ 4 నుంచి జైలర్ 2 వేట మొదలు కానుంది.



# వెంకటేశ్ -- త్రివిక్రమ్ సినిమాలో స్పెషల్ సర్‌ప్రైజ్

**పాత హిట్ పాటకు రీమిక్స్ ప్లాన్!**

టాలీవుడ్‌లో ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న క్రేజీ కాంబినేషన్లలో హీరో వెంకటేష్- దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్ కూడా ఒకటి. ఈ ఇద్దరి కలయికలో తెరకెక్కుతున్న తాజా చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. కుటుంబ కథా నేపథ్యంతో రూపొందుతున్న ఈ చిత్రంలో వినోదంతో పాటు భావోద్వేగాలు, యాక్షన్ అంశాలు కూడా ప్రధాన ఆకర్షణగా ఉండనున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమాలో ప్రేక్షకులకు ప్రత్యేకమైన సర్‌ప్రైజ్ ఇవ్వడానికి చిత్రబృందం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. వెంకటేశ్ గతంలో నటించిన ఓ హిట్ సినిమాలోని పాపులర్ పాటను కొత్తగా రీమిక్స్ చేసి ఈ సినిమాలో ఉపయోగించే ఆలోచనలో ఉన్నట్లు టాక్ వినిపిస్తోంది. అయితే ఏ పాటను ఎంపిక చేశారన్న విషయంపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. సాధారణంగా త్రివిక్రమ్ తన సినిమాల్లో సంగీతం, సంభాషణలు, వినోదం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. ముఖ్యంగా పాత క్లాసిక్ అంశాలను కొత్త తరానికి తగ్గట్టుగా అందించడంలో ఆయనకు ప్రత్యేక శైలి ఉంది. దీంతో వెంకటేశ్ పాత సినిమా పాటను కొత్తగా ఎలా చూపిస్తారనే ఆసక్తి అభిమానుల్లో పెరుగుతోంది. ఇక ఈ సినిమా కేవలం కుటుంబ కథతో మాత్రమే కాకుండా పూర్తి స్థాయి వినోదాత్మక చిత్రంగా రూపొందనున్నట్లు తెలుస్తోంది. యాక్షన్ సన్నివేశాలతో పాటు ప్రేక్షకులను నవ్వించే కామెడీ ట్రాక్ కూడా కీలకంగా ఉండబోతున్నట్లు సమాచారం. ముఖ్యంగా వెంకటేశ్ కామెడీ టైమింగ్‌కు త్రివిక్రమ్ రచన జతకావడంతో మరోసారి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ రూపుదిద్దుకోనుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. త్రివిక్రమ్ నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు సమాచారం. ప్రీ-ప్రొడక్షన్ నుంచి ప్రతి అంశాన్ని జాగ్రత్తగా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం షూటింగ్ పూర్తి చేసి వేసవి సీజన్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్రబృందం లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. కాగా, వెంకటేశ్ -- త్రివిక్రమ్ అనుబంధం కొత్తది కాదు. గతంలో నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి వంటి చిత్రాలకు త్రివిక్రమ్ రచయితగా పని చేశారు. ఆ సినిమాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇప్పుడు చాలా సంవత్సరాల తర్వాత వీరిద్దరూ నేరుగా హీరో -- దర్శకుడిగా కలిసి పనిచేస్తుండటంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది.



## బిజినెస్

### హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ సంచలన నిర్ణయం.. టోల్ టాక్స్ వసూళ్ల కోసం కొత్త చట్టం..!



ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధి వేదికగా అంతర్జాతీయ రాజకీయాలు తీవ్ర ఉత్కంఠ రేపుతున్నాయి. ఈ జలసంధి గుండా ప్రయాణించే నౌకల కోసం త్వరలోనే ఒక సరికొత్త వ్యవస్థను అమలు చేయనున్నట్లు ఇరాన్ అధికారికంగా ప్రకటించింది. ఈ కొత్త నిబంధనల ప్రకారం, జలసంధిని దాటే నౌకలపై ప్రత్యేకంగా 'టోల్ పన్ను' విధించనున్నారు. యుద్ధ నష్టాలను భర్తీ చేయడానికి, తమ సముద్ర తీర రక్షణ వ్యయాన్ని రాబట్టుకోవడానికే ఈ కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ఇరాన్ స్పష్టం చేసింది. ఇరాన్ పార్లమెంట్ సభ్యుడు ఇబ్రహీం అజీజీ తెలిపిన వివరాల ప్రకారం.. నౌకాయానం మరింత క్రమబద్ధీకరించడానికి ఇరాన్ ఒక కొత్త ట్రాఫిక్ నిర్వహణ వ్యవస్థను ప్రవేశపెట్టనుంది. ఈ వ్యవస్థ ద్వారా నౌకల కోసం ప్రత్యేక నిర్దేశిత మార్గాలను సృష్టించనున్నారు. అలాగే సముద్ర మార్గంలో కల్పించే నిర్దిష్ట సేవలకు గానూ ప్రత్యేక రుసుములను వసూలు చేస్తారు. అయితే, ఈ సౌకర్యాలు మరియు మార్గాలు కేవలం వాణిజ్య నౌకలకు, ఇరాన్‌తో స్నేహపూర్వక సహకారం అందించే దేశాలకు మాత్రమే అందుబాటులో ఉంటాయని అజీజీ స్పష్టం చేశారు. దీని అర్థం, ఇరాన్ తన శత్రు లేదా ప్రత్యర్థి దేశాల నౌకలపై భవిష్యత్తులో కఠినమైన ఆంక్షలు విధించే అవకాశం ఉంది. మరోవైపు ఇరాన్ ఉపాధ్యక్షుడు మొహమ్మద్ రెజా ఆరెఫ్ మాట్లాడుతూ, తమ శత్రు దేశాలకు చెందిన సైనిక పరికరాలను లేదా సైనిక నౌకలను హోర్ముజ్ జలసంధి గుండా వెళ్ళడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని తేల్చి చెప్పారు. ఇరాన్ పార్లమెంటు డిప్యూటీ స్పీకర్ అలీ నిక్జాద్ మరియు ఎంపీ అలీరెజా అబ్బాసి సంయుక్తంగా స్పందిస్తూ.. దేశ భద్రత, అంతర్జాతీయ చట్టాలు, పొరుగు దేశాల హక్కులను దృష్టిలో ఉంచుకునే ఈ కొత్త చట్టాన్ని రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. శత్రు దేశాల కోసం సైనిక పరికరాలను మోసుకెళ్లే నౌకలపై అదనపు ఆంక్షలతో పాటు భారీ జరిమానాలు, రుసుములు విధిస్తామని హెచ్చరించారు. ప్రపంచం ఇప్పుడు ఒక సరికొత్త భౌగోళిక-రాజకీయ వ్యవస్థ వైపు పయనిస్తోందని ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మొహమ్మద్ బఘర్ ఘాలిబాఫ్ వ్యాఖ్యానించారు. ఈ పరిణామాల మధ్య, ఇరాన్ సైనిక విభాగానికి చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ హోర్ముజ్ జలసంధికి సంబంధించిన ఒక కొత్త మ్యాప్‌ను విడుదల చేసింది. ఈ పటంలో ఇరాన్ తీరానికి అత్యంత సమీపంలో నౌకల కోసం ఒక కొత్త, సురక్షితమైన మార్గాన్ని చూపించారు. ఇది అంతర్జాతీయ నౌకాయానాన్ని తమ పూర్తి నియంత్రణలోకి తెచ్చుకునే వ్యూహంలో భాగమనే విమర్శలు వస్తున్నాయి. కాగా, ఈ ఉద్రిక్తతలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా స్పందించారు. ఇరాన్ త్వరలోనే శాంతి ఒప్పందానికి రాకపోతే, ఆ దేశం తీవ్రమైన ఆర్థిక, సైనిక పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. హోర్ముజ్ సంక్షోభంపై చైనా అనుసరిస్తున్న దౌత్య వైఖరికి రష్యా సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ ప్రాంతంలో శాశ్వత కాల్పుల విరమణే ఏకైక పరిష్కారమని రష్యా దౌత్యవేత్త మిఖాయిల్ ఉల్యనోవ్ పేర్కొన్నారు. అమెరికా, ఇరాన్‌ల మధ్య ప్రత్యక్ష చర్చలు, శాశ్వత కాల్పుల విరమణ ద్వారానే హోర్ముజ్ సంక్షోభాన్ని పరిష్కరించగలమని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ కూడా అభిప్రాయపడ్డారు. మరోవైపు, హోర్ముజ్ జలసంధిలో ఇరాన్ సాగిస్తున్న దాడులను, సముద్ర మార్గాల్లో మందుపాతరల అమరికను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ బహ్రెయిన్, అమెరికాలు సంయుక్తంగా ఐక్యరాజ్యసమితిలో ఒక కీలక తీర్మానాన్ని ప్రవేశపెట్టడానికి సన్నాహాలు చేస్తున్నాయి. ఈ పరిణామాలు గల్ఫ్ ప్రాంతంలో యుద్ధ మేఘాలను మరింతగా పెంచుతున్నాయి.

# తక్కువ బడ్జెట్‌లో సొంతిల్లు.. ఖర్చు తగ్గించే బెస్ట్ మార్గాలు!



సొంత ఇల్లు నిర్మించుకోవడం అనేది ప్రతి ఒక్కరి కల. కానీ ప్రస్తుతం.. సిమెంట్, ఇనుము, ఇసుక, కార్మిక చార్జీలు వంటి నిర్మాణ సామగ్రి ధరలు భారీగా పెరగడంతో ఇల్లు కట్టుకోవడం చాలా ఖరీదైన వ్యవహారంగా మారింది. అయినప్పటికీ.. సరైన ప్రణాళిక, ఖర్చుపై నియంత్రణ, తెలివైన నిర్ణయాలతో తక్కువ బడ్జెట్‌లో కూడా మంచి ఇల్లు నిర్మించుకోవచ్చు. ఇప్పుడు తక్కువ డబ్బుతో ఇల్లు ఎలా కట్టుకోవచ్చో వివరంగా తెలుసుకుందాం. ఇల్లు నిర్మాణంలో మొదటి అడుగు బడ్జెట్ నిర్ణయించడం. మీ ఆదాయం, సేవింగ్స్, బ్యాంక్ లోన్ సామర్థ్యాన్ని బట్టి ఎంత వరకు ఖర్చు చేయగలమో ముందే నిర్ణయించుకోవాలి. చాలా మంది ప్లాన్ లేకుండా పనులు ప్రారంభించి మధ్యలో ఆర్థిక ఇబ్బందులు పడుతుంటారు. అందుకే ముందుగానే.. నిర్మాణానికి సంబంధించిన పూర్తి అంచనా తయారు చేసుకోవాలి.

**చిన్న ప్లాన్‌తో ప్రారంభించడం మంచిది**

తక్కువ బడ్జెట్‌లో ఇల్లు కట్టాలంటే.. మొదట చిన్న ఇంటి డిజైన్ ఎంచుకోవడం ఉత్తమం. అవసరానికి మించి పెద్ద హాల్‌లు, ఎక్కువ బెడ్‌రూమ్‌లు, ఖరీదైన ఎలివేషన్లు పెట్టుకుంటే ఖర్చు భారీగా పెరుగుతుంది. భవిష్యత్తులో అవసరం పెరిగితే పై అంతస్తు లేదా అదనపు గదులు నిర్మించుకోవచ్చు.

**సింపుల్ డిజైన్**

ఇంటి డిజైన్ ఎంత క్లిష్టంగా ఉంటే.. నిర్మాణ వ్యయం అంత పెరుగుతుంది. కాబట్టి సాదాసీదా డిజైన్, సింపుల్ ఎలివేషన్, తక్కువ మలుపులు ఉన్న నిర్మాణం ఎంచుకోవడం మంచిది. దీని వల్ల సిమెంట్, ఇనుము, కార్మిక ఖర్చులు తగ్గుతాయి.

**నిర్మాణ సామగ్రి కొనుగోలులో జాగ్రత్త**

సిమెంట్, ఇనుము, ఇటుకలు వంటి మెటీరియల్స్‌ను ఒక్కోసారి కొనే బదులు, హోల్‌సేల్‌గా కొనుగోలు చేస్తే తక్కువ ధరలో లభిస్తాయి. అలాగే.. స్థానికంగా లభించే నాణ్యమైన మెటీరియల్స్ వాడితే ట్రాన్స్‌పోర్ట్ ఖర్చు కూడా తగ్గుతుంది. కానీ చవక కోసం నాసిరకం వస్తువులు కొనడం మాత్రం మంచిది కాదు.

**కార్మిక ఖర్చులను నియంత్రించడం**

నిర్మాణంలో లేబర్ ఖర్చు కూడా పెద్ద భాగం. కాంట్రాక్టర్‌కు పూర్తిగా అప్పగించకుండా, మెటీరియల్స్ మీరు కొనుగోలు చేసి కూలీలకు రోజువారీ చెల్లింపులతో పని చేయిస్తే కొంత వరకు ఖర్చు తగ్గుతుంది. అయితే పనిపై పర్యవేక్షణ తప్పనిసరి.

**అవసరమైన చోట మాత్రమే లగ్జరీ**

ఇంటి నిర్మాణంలో.. మార్బుల్ ఫ్లోరింగ్, ఫాల్స్ సీలింగ్, ఖరీదైన వుడ్‌వర్క్, డిజైనర్ టైల్స్ వంటి వాటికి ఎక్కువ ఖర్చు అవుతుంది. ప్రారంభ దశలో అవసరమైన వాటికే ప్రాధాన్యం ఇవ్వాలి. తరువాత ఆర్థిక పరిస్థితి మెరుగుపడితే ఇంటిని అప్‌గ్రేడ్ చేసుకోవచ్చు.

**ప్రభుత్వ పథకాలు వినియోగించుకోవాలి**

ప్రభుత్వం అందించే గృహ పథకాలు, సబ్సిడీ హోమ్ లోన్స్, ్రాహీూ వంటి పథకాల గురించి తెలుసుకోవాలి. అర్హత ఉంటే వీటి ద్వారా వడ్డీ భారం కొంత తగ్గుతుంది.

**ఎలక్ట్రిక్, వాటర్ ప్లానింగ్**

ఇల్లు నిర్మాణ సమయంలోనే విద్యుత్ వైరింగ్, నీటి పైపులు, డ్రైనేజ్ వ్యవస్థలను సరిగ్గా ప్లాన్ చేస్తే భవిష్యత్తులో మరమ్మతుల ఖర్చు తగ్గుతుంది. మొత్తం మీద.. తక్కువ డబ్బుతో ఇల్లు కట్టుకోవడం అసాధ్యమైన పని కాదు. అయితే సరైన ప్రణాళిక, ఖర్చుపై నియంత్రణ, అవసరాలకు తగ్గ డిజైన్, నాణ్యమైన మెటీరియల్స్ వినియోగం ద్వారా తక్కువ బడ్జెట్‌లో కూడా అందమైన, బలమైన ఇల్లు నిర్మించుకోవచ్చు. తొందరపడకుండా ప్రతి దశను ఆలోచించి ముందుకు వెళితే సొంతింటి కల సాకారం అవుతుంది.

### 20 నిమిషాల్లో ఛార్జ్.. 683 కి.మీ రేంజ్.. మహీంద్రా ఎలక్ట్రిక్‌పై రూ.2 లక్షల డిస్కౌంట్..!



భారతీయ ఆటోమొబైల్ మార్కెట్లో ఎలక్ట్రిక్ వాహనాలకు క్రేజ్ రోజురోజుకూ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో మహీంద్రా సంస్థ తన సరికొత్త ఎలక్ట్రిక్ కార్లను ఎక్కువ మంది వినియోగదారులకు చేరువ చేయడానికి మే 2026లో అదిరిపోయే డిస్కౌంట్ ఆఫర్లను ప్రకటించింది. ఈ భారీ ఆఫర్ లభిస్తున్న కార్ల జాబితాలో మహీంద్రాకు చెందిన మోస్ట్ స్టైలిష్ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ 'మహీంద్రా బిఈ 6' ముందు వరుసలో ఉంది. కంపెనీ తన వీ2025 మోడల్స్ పై క్యాష్ డిస్కౌంట్ రూపంలో ఏకంగా రూ. 2 లక్షల వరకు బంపర్ డిస్కౌంట్ ఆఫర్ చేస్తోంది. అయితే ఈ ఆఫర్ పరిమిత స్టాక్‌కు మాత్రమే అందుబాటులో ఉంటుంది. ఈ ఆఫర్ 31 మే 2026 వరకు మాత్రమే వాలిడ్ అవుతుందని కంపెనీ స్పష్టం చేసింది. మరికొన్ని డీలర్‌షిప్‌ల వద్ద ఎక్స్ఛేంజ్ బోనస్ లేదా యాక్సెసరీస్ రూపంలో అదనపు బెనిఫిట్స్ కూడా పొందే అవకాశం ఉంది. కొత్తగా వచ్చే వీ2026 మోడల్స్‌పై డిస్కౌంట్లు చాలా తక్కువగా లేదా అసలు ఉండకపోవచ్చు. అందుకే కారు కొనే ముందు మీ దగ్గరలోని డీలర్‌ను సంప్రదించడం మంచిది. మిడ్-సైజ్ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ సెగ్మెంట్లో స్టైలిష్ డిజైన్, పవర్‌ఫుల్ పర్ఫార్మెన్స్, లాంగ్ రేంజ్‌తో వచ్చే దీజు 6 కారుకు ఈ ఆఫర్ మరింత 'వాల్యూ ఫర్ మనీ'గా మారుస్తుందనడంలో సందేహం లేదు. ఈ కారు ధర, రేంజ్, ఫీచర్ల వివరాలపై ఓ లుక్కేద్దాం..

**ధరల వివరాలు:**

మహీంద్రా దీజు 6 ఎక్స్-షోరూమ్ ధర రూ. 18.90 లక్షల నుండి ప్రారంభమై, టాప్ వేరియంట్ కోసం రూ. 28.49 లక్షల వరకు ఉంటుంది. ఆన్-రోడ్ ధర (ఢిల్లీ) సుమారు రూ. 20-30 లక్షల మధ్య ఉండవచ్చు. బ్యాటరీ, ఛార్జర్ ఆప్షన్లను బట్టి ధరలలో మార్పులు ఉంటాయి. ప్రస్తుతం వీ2025 స్టాక్‌పై లభిస్తున్న రూ. 2 లక్షల డిస్కౌంట్ వల్ల ఈ కారు మరింత తక్కువ ధరకే లభించనుంది.

# శశాంక్ పోరాటం సరిపోలే.. పంజాబ్‌పై విజయంతో ప్లే ఆఫ్స్‌లో ఆర్సీబీ..!

## స్పోర్ట్స్



డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ప్లే ఆఫ్స్‌కు దూసుకెళ్లింది. ధర్మశాలలో పంజాబ్ కింగ్స్(్రాబఅయిఖఎ ఖఆఅస్త్రం)పై అదిరే విజయంతో నాకౌట్‌లో అడుగుపెట్టిన తొలి జట్టుగా అవతరించింది. వెంకటేశ్ అయ్యర్(73 నాటౌట్), విరాట్ కోహ్లీ(58)లు అర్ధ శతకాలతో ప్రత్యర్థి ముందు భారీ లక్ష్యాన్ని నిలిపిన బెంగళూరు రసిక్ దార్(3-36), భువనేశ్వర్(2-38) కృషితో 23 పరుగులతో గెలిచింది. శశాంక్ సింగ్(56) ఒంటరి పోరాటం చేసినా పంజాబ్‌కు వరసగా ఆరో ఓటమి తప్పించలేకపోయాడు.

భారీ ఛేదనలో తొలి ఓవర్లోనే ప్రియాన్ష్ ఆర్య(0)ను ఔట్ చేసిన భువనేశ్వర్(2-38).. డేంజరస్ ప్రభ్‌సిమ్రన్ సింగ్(2)ను వెనక్కి పంపి పంజాబ్‌కు షాకిచ్చాడు. ప్రభ్‌సిమ్రన్ ఆడిన బంతిని స్లిప్‌లో పడిక్కల్ రెప్పపాటులో క్యాచ్ అందుకోగా పంజాబ్ 18వద్ద రెండో వికెట్ కోల్పోయింది. కూపర్ కొన్నొల్లీ(37), కెపట్?న్ శ్రేయాస్ అయ్యర్(1)లు.. ఆదుకునే ప్రయత్నం చేయబోయారు. కానీ, రసిక్ దార్(3-36) సూపర్ డెలివరీతో అయ్యర్ వికెట్ కీపర్ జితేశ్ చేతికి దొరికాడు. పవర్ ప్లేలోనే కష్టాల్లో పడిన జట్టును సూర్యాన్ష్ షెడ్గే(35)తో కలిసి గెలిపించాలనుకున్న కూపర్ నాలుగో వికెట్‌గా వెనుదిరిగాడు. షెపర్డ్ ఓవర్లో పెద్ద షాట్ ఆడి బౌండరీ వద్ద బెథెల్ చేతికి చిక్కాడు. కాసేపటికే షెడ్గే ఔటవ్వగా.. ఇంప్యాక్ట్ సబ్ స్టోయినిస్(37), శశాంక్ సింగ్(56)లు దూకుడుగా ఆడారు. సుయాశ్ ఓవర్లో శశాంక్ మూడు సిక్సర్లతో 13 ఓవర్లకు స్కోర్ 120 దాటింది. కానీ, బెంగళూరు బౌలర్లు, ఫీల్డర్లు బౌండరీలు ఇవ్వలేదు. స్టోయినిస్‌ను హేజిల్‌వుడ్ ఎల్బీగా వెనక్కి పంపి పంజాబ్ ఆశలపై నీళ్లు చల్లాడు. చివరి ఓవర్లో 33 రన్స్ అవసరమవ్వగా రెండో బంతికి శశాంక్ ఔటయ్యాడు. అంతే ఆర్సీబీ 23 పరుగుల తేడాతో గెలిచి దర్జాగా ప్లే ఆఫ్స్ దూసుకెళ్లింది.

**కోహ్లీ, అయ్యర్ అర్ధశతకాలు**

ప్లే ఆఫ్స్‌కి అడుగు దూరంలో నిలిచిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు భారీ స్కోర్ కొట్టింది. పంజాబ్ కింగ్స్ బౌలర్లకు చుక్కలు చూపిస్తూ ధర్మశాలలో వెంకటేశ్ అయ్యర్(73 నాటౌట్), విరాట్ కోహ్లీ(58) అర్ధ శతకాలతో కదం తొక్కారు. పడిక్కల్(45)తో విరాట్ కీలక భాగస్వామ్యం నెలకొల్పగా.. ఆ తర్వాత అయ్యర్, టిమ్ డెవిడ్(28)లు ఉతికేశారు. దాంతో, పంజాబ్ ముందు కఠినమైన లక్ష్యాన్ని



నిర్దేశించింది బెంగళూరు.

### సాత్విక్ - చిరాగ్ జోడీకి చుక్కెదురు.. రన్నరప్‌గానే స్వదేశానికి!



థాయ్‌లాండ్ ఓపెన్ ఫైనల్లో భారత డబుల్స్ ద్వయం సాత్విక్ సాయిరాజ్ చిరాగ్ శెట్టి కి చుక్కెదురైంది. సెమీస్‌లో సంచలన విజయంతో టైటిల్ పోరుకు దూసుకెళ్లిన ఈ జోడీకి లియో రాలీ కర్నాండో -- డానియెల్ మార్టిన్(ఇండోనేషియా) చెక్ పెట్టారు. ఆదివారం జరిగిన ఫైనల్లో గట్టిగా పోరాడినా భారత జంటకు ఓటమి తప్పలేదు. కెరీర్లో తొలిసారి వీరి చేతిలో సాత్విక్ చిరాగ్ జోడీ ఓటమి ఎదురైంది. థామస్ కప్‌లో కాంస్యంతో మెరిసిన సాత్విక్ సాయిరాజ్ -- చిరాగ్ శెట్టి ద్వయం థాయ్‌లాండ్ ఓపెన్‌లో టైటిల్ చేజార్చుకుంది. ఈ సీజన్‌లో తొలి ఫైనల్లో చెలరేగుతారనుకుంటే ఉసూరుమనిపించింది. సెమీఫైనల్లో మలేషియా షట్లర్లపై అదిరే విజయంతో టైటిల్‌పై ఆశలు రేపినా చివరకు రన్నరప్‌తో సరిపెట్టుకుంది. ఆదివారం జరిగిన ఫైనల్లో ఇండోనేషియా జోడీ లియో రాలీ కర్నాండో -- డానియెల్ మార్టిన్ ధాటికి భారత జంట చేతులెత్తేసింది. తొలి సెట్‌ను మరీ దారుణంగా 12-21తో కోల్పోయిన సాత్విక్ -- చిరాగ్ రెండో సెట్‌లో గట్టిగానే ప్రతిఘటించారు. ప్రత్యర్థితో పోటీపడి పాయింట్లు సాధించారు. కానీ, మార్టిన్ జంప్ స్మాష్‌లతో విరుచుకుపడగా రెండు పాయింట్ల తేడాతో భారత ద్వయం కంగుతిన్నది. వరస సెట్లలో విజయంతో లియో -- డానియెల్ జోడీ టైటిల్‌ను తన్నుకుపోయింది.

AKSHARA SAAVAL PRINTED PUBLISHED EDITED AND OWNED BY BADAVATH BALAJI PRINTED AT H.NO.-1-9-1296/5/B/A/1, NEW SHAYAMPET, KAZIPET MANDAL, HANUMAKONDA, TELANGANA-506001,EDITOR B.BALAJI CELL:8096677136 H.NO.-45/12/151, INDIRA NAGAR, MANDAL GEESUGONDA, WARANGAL TELANGANA-506013_ **RNI** :TEL TEL / 2023/ 84132